## చిప్పల్‌తుర్తి పాఠశాల 8 మంది విద్యార్థులు మోడల్ స్కూల్‌కు ఎంపిక

**నర్సాపూర్, మే 26, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని చిప్పల్‌తుర్తి ఎంపియుపిఎస్ పాఠశాల విద్యార్థులు 8 మంది 2023, 2024 విద్యా సంవత్సరానికిగాను జక్కపల్లిలోని తెలంగాణ మోడల్ స్కూల్‌కు ఎంపికయ్యారు. ఈ మోడల్ స్కూల్‌లో చేరడానికి చిప్పల్‌తుర్తి పాఠశాల నుంచి 11 మంది విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షలు రాయగా 8 మంది అర్హత సాధించి మోడల్ స్కూల్‌కు ఎంపికయ్యారు. గడిచిన 5 సంవత్సరాల నుండి చిప్పల్‌తుర్తి ఎంపియుపిఎస్ పాఠశాల నుండి ప్రతి సంవత్సరం 8 నుండి 10 మంది విద్యార్థులు మోడల్ స్కూల్‌కు ఎంపికవుతున్నారని తెలిపారు. పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చూపించి ప్రవేశ పరీక్షల్లో వరుసగా రాణిస్తు ఎంపికవుతున్నారు. అయితే చిప్పల్‌తుర్తి పాఠశాల నుండి ఈ సంవత్సరం 8 మంది విద్యార్థులు మోడల్ స్కూల్ కు ఎంపిక కావడం పట్ల ఎంఈఓ బుచ్యానాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికుమార్, ఉపాధ్యాయులు మోహన్‌రావు, జ్యోతి, రవి, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తు విద్యార్థులను అభినందించారు.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట వార్త

## బండారుపల్లిలో 'కనువిప్పు'

**తొగుట, మే 26, ప్రభాతవార్త :** ఆవేశంలో చేసే పనులతో అనర్థాలు ఎక్కువగా ఉంటాయని..ఏదైనా పని చేసే ముందు ఒకటికి నాలుగుసార్లు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బండారుపల్లిలో గురువారం రాత్రి తొగుట పోలీసుల ఆధ్వర్యంలో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, సీపీ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువకులకు సీసీకెమెరాల రిపేర్, మెయింటినెన్స్, ఏసీ రిఫ్రిజిరేటర్ రిపేర్‌లో ఉచితశిక్షణ ఇవ్వడంతో పాటు భోజన వసతి కల్పించడం జరుగుతుందన్నారు. యువకులు అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలన్నారు. గంజాయి అక్రమంగా కలిగి ఉన్నా ఇతరులకు అమ్మిన వెంటనే డయల్ 100 లేదా పోలీసు కమిషనరేట్ కంట్రోల్‌రూం 8712667100కు ఫోన్‌చేయాలన్నారు. సామాజిక రుగ్మతులు, సమాజంలో జరుగుతున్న మంచి చెడులు, బాలికల, మహిళ రక్షణ చట్టాలు, ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్య క్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు శారద రఘుపతిరెడ్డి, కళాబృందం సభ్యులు బాలనర్సు, రాజు, రవీందర్, తిరుమల తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మహేందర్

### స్నేహిత, సఖీ, భరోసా సెంటర్ సేవలను
## మహిళలు సద్వినియోగం చేసుకోవాలి
### అడిషనల్ డిసిపి అడ్మిన్ మహేందర్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
అడ, మగ అనే తేడా లేకుండా సమానత్వంగా చూసినప్పుడే సమాజం, దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందని అడిషనల్ డీసీపీ అడ్మిన్ సందెపొగు మహేందర్ అన్నారు. సీపీ ఆదేశాల మేరకు శుక్రవారం సీపీ కార్యాలయంలో సీఐలు, ఎస్ఐలకు జెండర్ సెన్సిటైజేషన్‌పై స్వార్డ్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణకు పెద్దపీట వేస్తున్నాయని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు గృహహింస, వేధింపులకు గురైతే వెంటనే స్నేహితకు సమాచారం అందించి కౌన్సింగ్ ద్వారా కుటుంబాలను నిలబెట్టవచ్చునని తెలిపారు. మహిళలకు ఎలాంటి సమస్య వచ్చిన 9494 639498 హెల్ప్‌లైన్‌కు ఫోన్‌చేసి సహాయం పొందాలన్నారు. మహిళలకు స్నేహిత, సఖీ, భరోసా సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమాజంలో స్త్రీ, పురుష, కుల, మత భేదాలకు అతీతంగా అందరూ సమానమేనని మన ప్రవర్తన అలానే ఉండాలన్నారు. మహిళల రక్షణకు రూపొందించిన అన్ని చట్టాలను గౌరవించడంతో పాటు ఇతరులు గౌరవించేలా కృషి చేయాలన్నారు. స్వార్డ్ స్వచ్ఛంద సంస్థ సీఈవో శివకుమారి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది జానకీరాంరెడ్డి, కృష్ణ, తిరుపతి, సంజయ్, తిరుపతి, కిరణ్, దుర్గ, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

## భారతదేశాన్ని గ్లోబల్ లీడర్‌గా తీర్చిదిద్దాలి
### ఐఐటిహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిఎస్‌మూర్తి

**సంగారెడ్డి మున్సిపాలిటి మే 26,ప్రభాతవార్త:**


ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న వైస్ అడ్మిరల్ సందీప్ నైతానీ

సంగారెడ్డి సమీపంలోని ఐఐటి హైదరబాద్‌లోని టెక్నాలజీ రీసెర్చ్ పార్క్‌లో శుక్రవారం కో డెవలప్‌మెంట్ టెక్నాలజీ ఇన్నోవేషన్ సెంటర్ (సిటిఐసి)ను మెటీరియల్ ఛీఫ్ వైస్ అడ్మిరల్ సందీప్ నైతానీ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఐఐటిహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిఎస్‌మూర్తి మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలో 125కు పైగా స్టార్టప్‌లు,1000పైగా ఉద్యోగాలు సృష్టించినడం జరిగిందన్నారు. విధ్యార్థులు ఉద్యోగాల కోసం కాకుండా ఉద్యోగాలను సృష్టంచే పర్యావరణ వ్యవస్థను సృష్టించాలన్నారు. గోబల్ లీడర్‌గా భారతదేశాన్ని ఇంకా ముందుకు తీసుకెళ్ళే వనరులను సృషించాలన్నారు. ఛీఫ్ వైస్ అడ్మిరల్ సందీప్ నైతానీ మాట్లాడుతూ మాకృషి ఫలితాలను అందించడం చాల సంతోషకరమని అన్నారు. ఐఐటిహెచ్ నుండి శక్తివంతమైన, ప్రతిభావంతులు ప్రయోజనం పోందాలని కోరారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## చింత చెట్టును తొలగించి సిసి రోడ్డు ఏర్పాటు
**-చెట్టును నరికినట్లు సమాచారం లేదు: మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్**
**-చెట్టును నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి: ప్రజలు**


సిసి రోడ్డు నిర్మాణం కోసం తొలగించిన చింత చెట్టు ఇదే (ఫైల్)

**గజ్వేల్, మే 26 (ప్రభాతవార్త):**
గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో కోట్ల రూపాయల నిధులతో సిసి రోడ్ల నిర్మాణం చేపడుతున్న కాంట్రాక్టర్ల పనితీరు అస్తవ్యస్తంగా కొనసాగుతుంది. మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులలో కాంట్రాక్టర్లు లాభార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నారని వారు చేసే పనులు చూస్తే నివ్వెరపోవాల్సిందే. గజ్వేల్-ప్రజ్ఞా పూర్ మున్సిపల్ పరిధిలోని 15వ వార్డు బిడి కాలనీలో గత కొన్ని రోజుల క్రితం సిసి రోడ్డు నిర్మాణం చేపట్టారు. రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంబం ఉండగా దానిని తొలగించని కాంట్రాక్టర్లు గత 60 ఏళ్ళ చరిత్ర ఉన్న చింత చెట్టును రాత్రికి రాత్రే కొట్టివేయడం జరిగింది. ఇట్టి విషయంపై మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ బాలకృష్ణను వివరణ అడుగగా అధికారులు ఎవరూ చెట్టును తొలగించలేదని, అట్టి విషయం మా దృష్టికి రాలేదన్నారు. అధికారులకు తెలియకుండా కాంట్రాక్టరా లేక ప్రైవేట్ వ్యక్తులా అంత పెద్ద చింతచెట్టును రాత్రికి రాత్రే నరికివేయడం ఏమిటని ప్రజ్ఞాపూర్ కాలనీ వాసులు వాపోతున్నారు. అదే రోడ్డులో ఉన్న విద్యుత్ స్తంబాన్ని తొలగించకుండా చింత చెట్టును తొలగించడం ఏమిటని స్థానిక ప్రజలు అడిగితే కాంట్రాక్టర్లు పట్టించుకోవడంలేదని చెబుతున్నారు. సిఎం కెసిఆర్ ప్రతిష్టాత్మకంగా హరితహారం కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తే అందుకు విరుద్ధంగా చెట్లను నరికే కార్యక్రమం చేపడుతున్నారని ఇది ఎంతవరకు సమంజసమని కాలనీ వాసులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా చెట్టును నరికిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### మహ్మదాపూర్ సర్పంచ్,కార్యదర్శులపై కలెక్టర్‌కు ఫిర్యాదు
**-దుర్వినియోగం చేసిన నిధులు రికవరీ చేయాలని వినతి**

**హుస్నాబాద్, మే 7, ప్రభాతవార్త :** మండలంలోని మహ్మదాపూర్ గ్రామ సర్పంచ్ పిట్టల సంపత్, కార్యదర్శులు గ్రామంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలలో తప్పుడు బిల్లులు పెట్టి నిధుల దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ గోలిపెల్లి శ్రీనివాస్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వారిద్దరూ కుమ్మకై దుర్వినియోగం చేసిన నిధులపై సమగ్ర విచారణ జరిపి కాజేసిన సొమ్మును రికవరీ చేయాలని 14-8-20 సంవత్సరం లోనే ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేరని ఆరోపించారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందించి వెంటనే విచారణ జరిపి అధికార దుర్వినియోగం చేసిన సర్పంచ్ తిరుపతి, కార్యదర్శులను సస్పెండ్ చేయాలన్నారు.

## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి
### మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**మెదక్ అర్బన్, మే 26 ప్రభాతవార్త:**
ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ మరింత వేగవంతం చేసి జూన్ 2 నాటికి పూర్తయ్యేలా చూడాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా మండల ప్రత్యేకాధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, డీఎస్పీలకు సూచించారు. శుక్రవారం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతంపై అధికారులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ మిల్లుల వద్ద హమాలీలను అధిక సంఖ్యలో పెట్టుకొని ధాన్యం అన్‌లోడింగ్ త్వరగా అయ్యేలా తహసీల్దార్లు, డిప్యూటీతహసీల్దార్లు, గిర్దార్లు మిల్లుల వద్ద ఉండి పర్యవేక్షిస్తూ మిల్లర్లను పురమాయించాలన్నారు. కేంద్రం నిర్వాహకులు కూడా రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం తూకం అయిన వెంటనే లోడింగ్ చేసి మిల్లులకు తరలించాలన్నారు. మిల్లుల వద్ద ఎటువంటి కోతలు లేకుండా తక్షణమే దించుకొని ట్రక్‌షీట్ ఇచ్చేలా నిరంతరం పర్యవేక్షిస్తూ మండలవారీగా, మిల్లువారీగా రోజువారీ లోడింగ్, అన్‌లోడింగ్ నివేదిక అందజేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారిని ఆదేశించారు. ఎక్కడైనా మిల్లర్లు ధాన్యం దించుకోవడంలో అలసత్వం వహిస్తే నోటీసులు జారీ చేయాలన్నారు. సునిశిత కేంద్రాలను గుర్తించి అనవసరంగా ధర్నాలు, సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీసుల సహకారంతో తగు జాగ్రత్తలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. అధికారులు గన్నీ సంచుల కొరత లేకుండా, లారీల సమస్య తలెత్తకుండా నిరంతరం మానిటరింగ్ చేస్తూ ధాన్యం ఎక్కువగా ఉన్న కేంద్రాలకు త్వరగా లారీలను పంపాలని అన్నారు. ప్రతి మిల్లు వద్ద పోలీసులను పెట్టి త్వరగా అన్‌లోడింగ్ జరిగేలా అధికారులు మానిటరింగ్ చేయాలన్నారు. కొనుగోలు కేంద్రానికి, మిల్లులకు ట్యాగింగ్ చేసిన జిల్లాలోని 65 మిల్లులలో సంబంధిత మిల్లర్లు మూతపడిన అల్యూమినియం ఫ్యాక్టరీ, ఖండసారి షుగర్ ఫ్యాక్టరీ, బొల్లారంలోని గోదాముల్లో ధాన్యం భద్రపరచాలని సూచించారు. కాగా రేషన్‌బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం వస్తున్నాయని కొన్ని నిరాధార వార్తలు వస్తున్నాయని, వాటిని నమ్మరాదని కలెక్టర్ తెలిపారు. బలవర్ధకమైన పోర్టిఫైడ్ రైస్‌ను సాధారణ బియ్యంలో మిళితం చేసి రేషన్‌కార్డుదారులకు అందిస్తున్నామని, ఇది గమనించాలని సూచించారు. టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రమేష్, డీఎస్‌వో శ్రీనివాస్, డీఆర్‌డీవో, డీసీవో, ఆర్డీవోలు, మండల ప్రత్యేకాధికారులు, తహశీల్దార్లు, కేంద్రం నిర్వాహకులు తదితరులు ఉన్నారు.


రాష్ట్ర సరిహద్దులో వాహనాలను తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు, వ్యవసాయాధికారులు

## నకిలీని అడ్డుకునేందుకు టాస్క్ ఫోర్స్ తనిఖీలు
**-సరిహద్దులో వాహనాలు, గ్రామాల్లో దుకాణాల పరిశీలన**

**న్యాల్‌కల్, మే 26, ప్రభాతవార్త:** నకిలీ విత్తనాలు, ఎరువులతో రైతాంగం అవస్థలుపడి ఆర్థికంగా కష్టనష్టాలకు లోనుకాకుండా ఉండేందుకు టాస్క్‌ఫోర్స్ బృందం శుక్రవారం తనిఖీలు నిర్వహించింది. జహీరాబాద్-బీదర్ రోడ్డులో రాష్ట్ర సరిహద్దులో చెక్‌పోస్టు వద్ద కర్ణాటక నుంచి రాష్ట్రంలోకి వస్తున్న వాహనాలను అధికారులు తనిఖీలు చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణ రాష్ట్రంలోకి నకిలీ విత్తనాలు, ఎరువులు రాకుండా ఉండేందుకే తనిఖీ చేసినట్లు అధికారులు వివరించారు.

**ఎరువుల దుకాణాల తనిఖీ...**
న్యాల్‌కల్‌తోపాటు మండలంలోని గంగ్వార్ గ్రామంలో కొనసాగుతున్న ఎరువుల, మందుల దుకాణాలను టాస్క్‌ఫోర్స్ అధికారులు ఎడిఎ పుష్పరాణి, ఎస్ఐ అంబాజి, వ్యవసాయాధికారి లావణ్యలు పరిశీలించారు. ఈ సందర్భంగా పుష్పరాణి దుకాణాల నిర్వాహకులకు పలు సూచనలు సలహాలు చేశారు. దుకాణంలోని బోర్డుపై అందుబాటులోఉన్న సరుకుల వివరాలను, పరిమాణం నమోదు చేయాలని సూచించారు. దుకాణంలో రైతులు కొనుగోలు చేస్తే రశీదులపై నిర్వాహకులు సంతకాలు చేయాలని సూచించారు. దుకాణాల్లోని రికార్డులను పరిశీలించారు.

## ధాన్యం కొనుగోలు మరింత వేగవంతం
### మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్

**గజ్వేల్, మే 26 (ప్రభాతవార్త):**
రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు విషయంలో అన్ని చర్యలు తీసుకుంటుందని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో పనిచేస్తున్న కొనుగోలు కేంద్రాలను ఆర్డీఓ విజయేందర్‌రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మరావు, మేనేజర్ హరీష్‌లు కలిసి కొనుగోలు కేంద్రాలను సందర్శించి పలు సూచనలు చేయడం జరిగింది. అక్కడ ఉన్న రైతులతో కొనుగోలు జరుగుతున్న తీరు గురించి వారు మాట్లాడారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ మాట్లాడుతూ మార్కెట్ పరిధిలో 35 కొనుగోలు కేంద్రాలు ఉండగా రైతులు తెచ్చిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు తరలిస్తుండగా మిగతాధాన్యాన్ని ఇంకా త్వరగా ఎటువంటి ట్రాన్స్‌పోర్ట్ సమస్య తలెత్తకుండా త్వరితగతిన తరలించేందుకు గానూ వ్యవసాయ మార్కెట్‌లోని గోడౌన్, ముట్రాజ్‌పల్లి సమీపంలోని ఒక గోడౌన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా అహ్మదీపూర్‌లో గోడౌన్ ధాన్యాన్ని లోకల్ ట్రాన్స్‌పోర్ట్ ద్వారా త్వరగా తరలించేందుకు గానూ అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని రైతులు పండించిన ధాన్యం మొత్తం ఒకేసారి కొనుగోలు కేంద్రాలకు చేరుకోవడంతో ఎటువంటి సమస్య తలెత్తకుండా చూస్తున్నామన్నారు. రైతులు ఎవరూ అధైర్యపడ వద్దని, ప్రభుత్వ మద్దతుధరతో కొనుగోలు చేస్తామని, అధికార యంత్రాంగం రైస్‌మిల్లులకు తర లించడానికి అవసరమైన మేర లారీలు అందుబాటు లోకి తెచ్చేలా చూడడం జరుగుతుందన్నారు. పంపించిన ధాన్యాన్ని హమాలీల కొరతలేకుండా ధాన్యాన్ని త్వరగా అన్‌లోడ్ చేసుకోవాలని విజ్ఞప్తిచేశారు. కొనుగోలు కేంద్రాలలో గన్నీ బ్యాగుల కొరత లేకుండా నిరంతరం పర్యవేక్షణ చేస్తూ అవసరమైన వారికి నేరుగా గన్నీ బ్యాగులు పంపించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు కూడా ఓపికగా ఉండాలని, మీరు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో విక్రయించి లాభాలు పొందాలని విజ్ఞప్తి చేశారు. వారివెంట మార్కెట్ కార్యదర్శి జాన్‌వెస్లీ, సూపర్‌వైజర్ మహిపాల్, ఐకెపి, పిఎసిఎస్ అధికారులు ఉన్నారు.


ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఎంసి చైర్మన్ శ్రీనివాస్, ఆర్డీఓ విజయేందర్‌రెడ్డి

## ప్రమాదకరంగా మారిన రోడ్లు
**-సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు నర్సింలు**


కందిలో చౌరస్తాలో రోడ్డుదుస్థితి పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న సిపిఎం నేతలు

**కంది, మే 26, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో రోడ్డు ప్రమాదకరంగా మారిందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.నర్సింలు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం కంది చౌరస్తాలో రోడ్డు పరిస్థితిని ఫొటోల ద్వార ప్రదర్శించారు. ఈ సందర్భంగా నర్సింలు మాట్లాడుతూ కందిలోని జాతీయ రహదారితోపాటు కంది నుంచి శంకర్‌పల్లి వైపు వెళ్లే కాశీపూర్, చేర్యాల్, జుల్కల్, ఎద్దుమైలారం గ్రామాల రోడ్డు పూర్తిగా పాడైపోయాయన్నారు. కంది చౌరస్తా గుండా హైదరాబాద్ నుంచి బొంబాయికి వేల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయని, కంది చౌరస్తాలో ఫ్లైఓవర్ వంతెన లేకపోవడంతో అటుగా రోడ్డును దాటేందుకు వాహన చోదకులు, ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల నుంచి మండల కేంద్రానికి నిత్యం వందల సంఖ్యలో ప్రజలు వస్తు ఉంటారని, చౌరస్తా వద్ద రోడ్డు పరిస్థితి దయనీయంగా ఉండటంతో ప్రజలు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని దాటాల్సిన దయనీయ స్థితి దాపురించిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ వంతెన నిర్మించి, పాడయిన రోడ్లును సరిచేయాలని నర్సింలు డిమాండ్ చేశారు.

## బెల్లి లలిత ఆశయ సాధనకు కృషి చేయడమే నిజమైన నివాళి
**-అరుణోదయ సాంస్కృతిక సమైఖ్య కన్వీనర్ విమలక్క**

**హుస్నాబాద్, మే 26,ప్రభాతవార్త :**
బెల్లి లలిత ఆశయ సాధనకు కృషి చేయడమే ఆమెకు నిజమైన నివాళి అని అరుణోదయ సాంస్కృతిక సమైఖ్య కన్వీనర్ విమలక్క అన్నారు. శుక్రవారం బెల్లి లలిత 24వ వర్ధంతి కార్యక్రమం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో విమలక్క లలిత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లా డుతూ తెలంగాణ కోసం జరిగిన పోరాటంలో లలిత చేసిన కృషి మరువలేనిదన్నారు. నేడు కుల, మతాలుగా విభజన రేకలుగీసి మనకు మనకే తాకులాటలు పెట్టే దౌర్భాగ్య పరిస్థితులు నెలకొన్నాయని, కుల వర్గరహిత సమాజం కోసమే అందరం కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కేడం లింగమూర్తి, మ్యాకల వీరన్న, వల్లపు రాజు తదితరులు పాల్గొన్నారు.



బెల్లి లలితకు నివాళి అర్పిస్తున్న విమలక్క

**సహదేవరెడ్డి కుటుంబానికి పరామర్శ**
దివంగత విప్లవకవి రచయిత రిక్కల సహదేవరెడ్డి కుటుంబ సభ్యులను శుక్రవారం విమలక్క పరామర్శించారు. 35 ఏళ్ల క్రితం తమ సహోదరుడు సహదేవరెడ్డి ఎదుర్కొన్న ఇబ ్బందులు, కనిపించకుండా పోయిన విషయాన్ని ఆయన సహోదరిణులు విమలక్కకు చెబుతూ కన్నీటి పర్యంతమయ్యారు. కనిపించకుండా పోయిన తమ తమ్ముడి శవం కూడా తమకు లభించలేదని వాపోయారు. ఈ సందర్భంగా సహదేవరెడ్డిపై విమలక్క ప్రత్యేక గేయాన్ని ఆలపించారు. ఇంట్లో ఉన్న సహదేవరెడ్డి చిత్రపటాన్ని చూసిన విమలక్క ఆనాటి రోజులను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ఆయన రచించిన రక్తచలన సంఘీతం పుస్తకం ఇటీవల ఒక చోట లభ్యమైందని ఆ పుస్తకాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు. కార క్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు, రచయితలు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి : వంటేరు ప్రతాప్‌రెడ్డి

**వర్గల్, మే 26 (ప్రభాతవార్త):**
గ్రామాల్లోని దేవాలయాల అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం శాకారం, చౌదరిపల్లి గ్రామాల్లో నిర్మిస్తున్న పెద్దమ్మతల్లి, పోచమ్మ దేవా లయాలకు అభివృద్ధికి రూ.50వేల చొప్పున రూ.లక్ష విరాళం అందజేశారు. దేవాలయాల నిర్మాణాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని వారు తెలిపారు. గ్రామాలలోని ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలంటే గ్రామ దేవతలకు పూజలు అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి బాలమల్లు యాదవ్, ఎంపిపి లతారమేష్‌గౌడ్, పిఏసిఎస్ చైర్మన్ ఇర్రి రామకృష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వేలూరి వెంకట్‌రెడ్డి, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు నాగరాజు, నాచారం ఆలయ డైరెక్టర్ పడిగె రాజు, గ్రామ ప్రజలు, ముదిరాజ్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో దోపిడీ
**-రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భాగయ్య**


మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు భాగయ్య

**పెద్దశంకరంపేట, మే 26 ప్రభాతవార్త:** ప్రభుత్వం తరపున ఐకేపీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి దాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరుతో దోపిడీ చేస్తున్నారని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు భాగయ్య ఆరోపించారు. శుక్రవారం మండల పరిధిలోని బూర్గుపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో 40 కిలోల బస్తాకు 43 కిలోలు తూకం వేస్తున్నారన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఐకేపీ సిబ్బంది మిల్లర్లతో కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి రైతులు నష్టపోకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు లక్ష్మణ్, శంకర్, నర్సింలు, రాజు, అశోక్ తదితరులు ఉన్నారు.

## విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలి
### సిద్దిపేట జడ్పీ స్థాయి సంఘం సమావేశంలో చైర్‌పర్సన్ రోజాశర్మ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
వానాకాలం పంట సాగుకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వేలేటీ రోజాశర్మ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జడ్పీ స్థాయి సంఘం సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వడగండ్లవానలతో యాసంగిలో వరి పంటకు నష్టం వాటిల్లుతున్న నేపథ్యంలో నెల ముందుగానే వరి పంటను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. గీత బీమా పథకంలో ఎక్సి గ్రేసియా డబ్బులు లబ్ధిదారులకు తొందరగా అందించేలా చూడాలన్నారు. ఈ సంవత్సరం జిల్లాలో 18 వేల ఎకరాలలో ఆయిల్‌ఫామ్ సాగుచేసేలా అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆయిల్ ఫామ్‌తో అధిక లాభాలు ఉన్నాయన్నారు. మత్స్య సహకార సంఘాలలో సభ్యత్వ నమోదు ప్రక్రియ తొందరగా పూర్తిచేయాలన్నారు. జిల్లాపరిషత్ స్థాయి సంఘం సమావేశాలకు కాలుష్య నియంత్రణ అధికారులు హాజరు కాకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని జడ్పీ సీఈవోనే అదేశించారు. జిల్లాలో రెండోవిడత గొర్రెల పంపిణీలో 17,286 మంది లబ్దిదారులకు గొర్రెలు పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు పశుసంవర్ధశాఖ అధికారులు తెలిపారు. హరిత హారంలో ఈ ఏడు 12.20 లక్షల మొక్కలు నాటడానికి సిద్ధం చేస్తున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. ముందస్తు వరిసాగు అధిక దిగుబడి వచ్చే వరి పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివ ప్రసాద్ తెలిపారు. అలాగే వివిధశాఖలకు చెందిన అధికారులు తమ ప్రగతిని చదివి వినిపించారు. సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ రాజారెడ్డి, జడ్పీ సీఈవో రమేష్, జిల్లా పరిషత్ సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్మన్ రోజాశర్మ

## గిరిజనులంటే చిన్న చూపా

**చిన్నశంకరంపేట, మే 26, ప్రభాతవార్త:** గిరిజన తండాలను బిఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీలుగా మార్చినప్పటికి అభివృద్ధి చేయడంలో స్థానిక ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి విఫలమైందని మండలానికి చెందిన వివిధ తండాల సర్పంచులు ఆరోపించారు. శుక్రవారం చిన్నశంకరంపేటలో ఏర్పాటు చేసిన స్థానిక విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... మండల స్థాయిలోని పదవులను ఉన్న వారికే కట్టబెడుతున్నారని, కనీసం ఆమెను కలిసే స్వచ్ఛ కూడ లేదన్నారు. సొంత పార్టీలో ఉంటూ తమను అవమానిస్తున్న ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. నియోజకవర్గంలో ఉండే నాయకుడికే వచ్చే ఎన్నికల్లో పోటిలోకి దింపాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు గోపాల్‌నాయక్, లక్ష్మీ రాములు నాయక్, విఠల్ నాయక్, రాజాసింగ్, ఉప సర్పంచులు లాలు నాయక్, తారచంద్, రవినాయక్, సంతోష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తండా సర్పంచులు

## కమ్యూనిటీ హాల్‌ను వార్డు కార్యాలయంగా మారిస్తే ప్రతిఘటిస్తాం

చిక్కడపల్లి, మే 26 ప్రభాతవార్త: జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌ను జిహెచ్‌ఎంసి వార్డు కార్యాలయానికి కేటాయించడాన్ని తాను తీవ్రంగా వ్యవతిరేకిస్తున్నట్లు గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కార్పొరేటర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పేద, మధ్యతరగతి ప్రజలకు వారి శుభకార్యాలయాలకు ఉపయోగించుకునే కమ్యూనిటీ హాల్‌ను జిహెచ్‌ఎంసి అదధికారులు వార్డు కార్యాలయం కోసం వినియోగిస్తామని అనడం సమంజసం కాదని, అలాంటి చర్యలకు తాను విరుద్ధమని, డివిజన్‌లోని పలు ప్రభుత్వ కార్యక్రమాలకు, భారీగా డబ్బు వెచ్చించలేని పేద ప్రజలు శుభ కార్యక్రమాలకు ఉపయోగించుకునే కమ్యూనిటీ హాల్‌ను వార్డు కార్యాలయంగా ఉపయోగిస్తే ఊరుకునే ప్రసక్తేలేదని, ప్రతిఘటిస్తామని, అధికారులు ఈ విషయంలో ఉపరాలోచించి వార్డు కార్యాలయం ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేనిచో ప్రజలతో కలిసి పెద్దఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

## యూటర్న్' పాదచారుల దారి' పనులను వెంటనే ప్రారంభించాలి

చిక్కడపల్లి, మే 26 ప్రభాతవార్త: ఆర్టీసిక్రాస్‌రోడ్స్ నుంచి అశోక్‌నగర్ వరకు కొనసాగుతున్న స్టీల్‌బ్రిడ్జ్ నిర్మాణం కింద నేటి వరకు 'యూటర్న్', 'పాదచారుల దారి' పనులను నేటికి పనులు ప్రారంభించక పోవడం పట్ల గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం స్టీల్‌బ్రిడ్జ్ పనులు జరిగే ప్రాంతాన్ని డిఈఈ సుదర్శన్, నగర బిజెపి నేత ఎ.వినయకుమార్‌తో కలిసి పరిశీలించారు. పనుల ఆలస్యం గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వెంటనే 'యూటర్న్', 'పాదచారుల దారి' పనులను ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. బిజెపి గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రత్నాసాయిచంద్, బిజెపి నేతలు శ్రీకాంత్, ఎం.ఉమేశ్, ఆకుల సురేందర్, లక్ష్మణ్‌యాదవ్, దోనేటి సత్యం, స్థానికులు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## నేడు మంత్రి హరీష్‌రావ్ చేతులపై పద్మశాలి భవన్‌కు భూమిపూజ

**బిఆర్ఎస్ మండల అధ్యక్షులు రామేశ్వరం నర్సిహ్మా**

నార్సింగి, మే 26 ప్రభాతవార్త : రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం కోకాపేట్‌లో నేడు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావ్ చేతుల మీదుగా పద్మశాలి భవన్‌కు భూమిపూజ జరుగనుందని బీఆర్ఎస్ అద్యక్షులు రామేశ్వరం నర్సిహ్మా పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం 2.గంటలకు ఈ భూమిపూజ కార్యక్రమం ఉంటుందని, గండిపేట మండలంలోని బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పద్మశాలి కులస్థులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సూచించారు. ఈ వేడుకకు చేవెళ్ల ఎంపి గడ్డం రంజిత్‌రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, జిల్లా ఇంచార్జి ఎల్.రమణ, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌లు ముఖ్య అతిథులుగా విచ్చేస్తున్నారని వివరించారు.

## ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చని రాష్ట్ర ప్రభుత్వం

**ఆర్టీసీ బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేష్**

తార్నాక, మే 26 ప్రభాతవార్త: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆర్టీసీ కార్మికుల సమస్యలను తీర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆర్టీసీ బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేష్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన తార్నాకలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మునుగోడు ఎన్నికల సమయంలో తమ కార్మికులు మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్, పువ్వాడ అజయ్‌కుమార్, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి తదితరులకు కలసి సమస్యలపై వినతిపత్రాలను ఇవ్వడం జరిగిందన్నారు. అయితే వారు ఆసయంలో సమస్యలను పరిష్కరిస్తామని హామినిచ్చినా నేటికి తీరలేదని ఆయన వాపోయారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న తమ కార్మికుల పేస్కేల్, 2013 బాండ్ ఎరియర్స్, 2019 నుంచి రావలసిన డేఏతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని సుద్దాల సురేష్ డిమాండ్ చేశారు. లేనిచో జూన్ 2న రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులమంతా నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపనున్నామని ఆయన హెచ్చరించారు.

## తెలంగాణ జనసమితి ప్లీనరీ సభలు పోస్టర్ ఆవిష్కరణ

చిక్కడపల్లి, మే 26 ప్రభాతవార్త: తెలంగాణ జనసమితి ప్లీనరీ సభలకు సంబంధించి పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు గుండెల్లి రవీందర్‌యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. జూన్ 4న సూర్యాపేట పట్టణ కేంద్రంలో జరిగే ఈ సభలకు గ్రేటర్ హైదరాబాద్ నుంచి పెద్దఎత్తున కార్యకర్తలు రావాలని పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం పార్టీ గ్రేటర్ అధ్యక్షుడు ఎం.నరసయ్య విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా తెలంగాణ జనసమితి అలుపెరగని పోరాటం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిజెఎస్ ప్రధాన కార్యదర్శి బట్టల రామ్‌చందర్, ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్, కవాడీగూడ, రామ్‌నగర్, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షులు అజయ్ గౌడ్, పులిపాటి సుధాకర్, కాకునూరి సుధాకర్, నగర నాయకులు సురేశ్, జైపాల్‌రెడ్డి, లక్ష్మణ్, చంద్రగిరి పాల్గొన్నారు.

## రామ్‌నగర్ డివిజన్‌లో కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు : ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి, మే 26 ప్రభాతవార్త: రామ్‌నగర్ డివిజన్ పరిధిలోని దయార మార్కెట్, రామ్‌నగర్ చౌరస్తాలో కలుషిత నీరు, డ్రైనేజీ సమస్యల పనులకు వెంటనే మరమ్మత్తు పనులు చేపట్టాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయా ప్రాంతాలలో జలమండలి డీజీఎం మోహన్‌రాజ్, బిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహాలతో కలిసి పర్యటించి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట కేశవపురం అరుణ్, గజ్జల సూర్యనారాయణ, కొండమడుగు మధు, వాసుదేవ్, సునీల్, భరత్, నరసింహా, శ్రీధర్‌రెడ్డి, బస్తీ వాసులు పాల్గొన్నారు.

## సమస్యలపై అధికారులు, నాయకుల దృష్టి

ఖైరతాబాద్, మే 26 ప్రభాతవార్త: బస్తీల, కాలనీలలో ఉన్నటువంటి ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు ఇటు ఎమ్మెల్యే అటు కార్పొరేటర్ ఖైరతాబాద్‌లో శరవేగంగా ఫోకస్ పెట్టి స్థానికంగా ప్రజలకు అన్ని విధాలుగా చేరువవుతున్నారు. మంచినీరు, వీధి దీపాలు, రోడ్లు తదితర అభివృద్ధి వాటిపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇటు కార్పొరేటర్ పి.విజయారెడ్డిలు వాటికి ఎక్కువగా ప్రాధాన్యతనిస్తున్నారు. ఇటీవల ఒక బస్తీలో డ్రైనేజీ వ్యవస్థను కూడా పరిష్కారమార్గంలో భాగంగా అభివృద్ధి చేశారు. ఈ విధంగా వారి దృష్టికి వచ్చిన ప్రధాన సమస్యల పరిష్కారంవైపే వారు సంబంధిత అధికారులతో మమేకం ఏర్పరుచుకుని బస్తీల, కాలనీలలో దృష్టిపెట్టారు. రాబోయే వర్షాకాలంలో స్థానికంగా మురికినాలాలు, ముంపునకు గురవ్వకుండా చూడడం వంటి సమస్యలపై స్థానికంగా కొందరు వారి దృష్టికి తీసుకువచ్చిన నేపథ్యంలో వాటి పరిష్కారానికి ఇప్పటి నుండే కృషి చేస్తున్నారు.

## ఎస్‌బిఐలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల బదిలీలను తక్షణమే నిలిపివేయాలి

**కనీస వేతనం చట్టం అమలు చేసి 8 గంటల పనివిధానాన్ని కొనసాగించాలి**



సమావేశంలో మాట్లాడుతున్న ఆకుల శ్రీనివాస్

సైఫాబాద్, మే 26 ప్రభాతవార్త: దేశ వ్యాప్తంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ)లో పనిచేస్తున్న లక్షలాది మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల బదిలీలను తక్షణమే నిలిపివేయాలని, కనీస వేతనం చట్టం అమలు చేసి పూర్తిస్థాయిలో పిఎఫ్ చెల్లించాలని, 8 గంటల పనివిధానాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని ఎస్‌బిఐ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ యాజ మాన్యాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యూనియన్ జాతీయ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఎడవెల్లి నర్సింహ్మా, డబ్ల్యూపిసి ఎగ్జిక్యూటివ్ మెంబర్ షేక్ సాలావుద్దీన్ తదితరులు మాట్లాడుతూ బ్యాంక్‌లో గత కొన్ని సంవత్సరాలుగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు విధులను నిర్వహిస్తు న్నారని ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే 7 వేల మంది పనిచేస్తు న్నారని, దేశవ్యాప్తంగా లక్షలాది మంది పనిచేస్తున్నారని వీరికి నెలకు 12 వేలు వేతనం చెల్లిస్తూ 12 గంటల పాటు పనిచేయించకుంటున్నారని, అంతేకాకుండా బదిలీల పేరిట మరింతగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఒక బ్రాంచీ నుంచి మరొక బ్రాంచీకి బదిలీ చేస్తూ బలవంతంగా బిల్లింగ్ తీసుకుని బదిలీలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు చెప్పారు. ఇడిఎల్ఐ స్కిమ్ కింద చనిపోయిన 500 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఏలాంటి బెనిఫిట్స్ అందలేదని, వెంటనే చెల్లించాలని, ఉద్యోగులపై యాజమాన్యం వేధింపులు ఆపాలని వారు డిమాండ్ చేశారు. పై డిమాండ్లపై త్వరలో హైదరాబాద్ నగరానికి విచ్చేయనున్న పార్లమెంటరీ స్టాడింగ్ కమిటి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలని వారు కోరారు. 2017లో తమ యూనియన్ కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళడం జరిగిందని ఆయన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ దృష్టికి తీసుకువెళ్ళి బోనస్, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించడం జరిగిందని వారు తెలిపారు.

## డ్రైనేజీ పనులను త్వరగా పూర్తి చేయాలి: ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

హైదరాబాద్, మే 26 ప్రభాతవార్త: నల్లకుంట డివిజన్‌లో శుక్రవారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పాదయాత్ర నిర్వహించారు. తొలుత శివానంద్‌నగర్‌లో పాదయాత్ర నిర్వహించి ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ 23 లక్షలతో నిర్మించన్ను డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పరిశీలించారు. పనులను త్వరతిగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే మూసి ప్రభావిత ప్రాంతాల్లో కడుతున్న రిటేయినింగ్ వాల్‌నిర్మాణ పనులను కూడా ఎమ్మెల్యే పరిశీలించారు. అక్కడి ప్రజలు కోరిన విధంగా ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ భద్రతాగోడ, ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని మంచినీటి పైప్‌లైన్ పనులు కూడా పూర్తి చేస్తామన్నారు.

అనం తరం ఎమ్మెల్యే నల్లకుంటలోని స్ట్రీట్ నెంబరు 6లో దాదాపుగా పూరైన డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పరిశీలించారు. పనులు పూర్తికాగానే సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తామన్నారు. అంబర్‌పేట నియోజక వర్గంలో సిసి రోడ్ల నిర్మాణానికి రెండు కోట్ల రూపాయలు మంజూరైనాయని ఇందులో 75 లక్షల రూపాయల నిధులను 4, 5, 6 వీధుల్లోని వివిధ ప్రాంతాలలో సిసి రోడ్లు వేస్తామన్నారు.



డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న కాలేరు వెంకటేష్, అమృత

**14.8 లక్షలతో డ్రైనేజీ పైప్ పనులకు శంకుస్థాపన**

తిలక్‌నగర్‌రోడ్డులోని బాలాజీ ఆర్కేడ్ అపార్ట్‌మెంట్‌లో 14 లక్షల 50 వేల రూపాయల వ్యయంతో నూతనంగా వేయనున్న డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్ అమృత కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మేడి ప్రసాద్, భాస్కర్‌గౌడ్, గోనె ప్రదీప్‌రావు, కూర నరేందర్, రాముయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ అభివృద్ధికి నిరంతరం కృషి : మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

కంటోన్మెంట్,మే 26 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధికి బిఆర్ఎస్ ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని రాష్ట్ర పశుసంవర్ధక, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మోండా డివిజన్ ఈస్ట్ మారేడ్‌పల్లిలోని శ్రీపురి కాలనీలో రూ.28 లక్షల వ్యయంతో చేపట్టనున్న మంచినీటి నిర్మాణం పనులను కార్పొరేటర్ కొంతం దీపిక, బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి, దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతుర్లు లాస్య నందిత, నివేదితలతో కలిసి పనులు ప్రారంభించారు. మంత్రి తలసాని మాట్లాడుతూ దివంగత ఎమ్మెల్యే సాయన్న కోటా కిందా 10 కోట్ల రూపాయల నిధులు మంజూరైన ఆయన తెలిపారు. ఆయన హయాంలో మంజూరైన నిధులకు శ్రీకారం చుడుతున్నామన్నారు. ఆయా ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ ఆకులరూప హరిక్రిష్ణ, సుబ్రమణ్య స్వామి దేవాలయం చైర్మన్ సి.సంతోష్ యాదవ్, జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, జలమండలి ఇంజనీర్లు క్రిష్ణ, శ్రవంతి, ఏఈ రవిందర్, కో-ఆప్షన్ సభ్యుడు నరిసింహ్మా బిఆర్ఎస్ నేతలు పిట్ల నాగేశ్, ముదిరాజ్, బి.నారాయణ, ముప్పిడి మధుకర్, నివేదిత, నాగినేని సరిత, భవాని, పెద్దాల నరిసింహ్మా, కాశిరెడ్డి, పెంట శ్రీహరి, కిరణ్, సదానంద్ గౌడ్, భాస్కర్ ముదిరాజ్, దాసరి కర్ణకుమార్, మురళీ యాదవ్, ప్రవీణ్ యాదవ్, న్యూ క్లబ్ ఉపాధ్యక్షులు మధుసూదన్, బిజెపి నేతలు కొంతం నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఈస్ట్ మారేడ్‌పల్లి శ్రీపురికాలనీలో రూ.28 లక్షల వ్యయంతో మంచినీటి పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్,కార్పోరేటర్ కొంతం దీపిక, మర్రి రాజశేఖర్ రెడ్డి, లాస్య

# డీఎస్సీ 2008 బీఈడీ మెరిట్ అభ్యర్థులకు న్యాయం చేయాలి

**బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య**

ధర్నాచౌక్, మే 26, ప్రభాతవార్త: డీఎస్సీ 2008 సెకండరీ గ్రేడ్ టీచర్స్ నోటిఫికేషన్ ప్రకారం సెలక్ట్ అయి ఉద్యోగాలు పొందని బీఈడీ మెరిటన అభ్యర్థులకు తక్షణమే ఉద్యోగాలు కల్పించి, వారికి న్యాయం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో డీఎస్సీ 2008 సెకండరీ గ్రేడ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు సంఘీభావం తెలిపిన అనంతరం ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ 14 సంవత్సరాలుగా తెలంగాణ బిడ్డలు ఉద్యోగాల కోసం పోరాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవటం దుర్మార్గమని ధ్వజమెత్తారు. 2008 డీఎస్సీ అభ్యర్థులకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించారు. సుప్రీం కోర్టుకూడా అభ్యర్థులకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని, ఇక ఎటువంటి చట్ట పరమైన ఇబ్బందులు లేకున్నా ప్రభుత్వం ఎందుకు అభ్యర్థుల జీవితాలతో ఆడుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని, ఉపాధ్యాయులు లేక ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అవుతున్నాయని, పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి, డీఎస్సీ 2008 అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ 2008 అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు తమ వెంట ఉండి పోరాడతామని హామీ ఇచ్చారు. డీఎస్సీ 2008 అభ్యర్థుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చి, నిమ్మరసంతో దీక్షను విరమింపచేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమసంఘం నాయకులు గుజ్జకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




డీఎస్సీ 2008 అభ్యర్థుల దీక్షకు మద్దతు తెలుపుతున్న ఆర్.కృష్ణయ్య

## వైభవంగా సారస్వత పరిషత్తు పురస్కారాల ప్రదానోత్సవం



నాంపల్లి, మే 26 ప్రభాతవార్త : తెలంగాణ సారస్వత పరిషత్తు 80వ వార్షికోత్సవ సందర్భంగా 4రోజుల పాటు జరుగుతున్న వేడుకల్లో భాగంగా శుక్రవారం రాత్రి పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో 2023 సంవత్సరానికిగాను పరిషత్తు వివిధ ప్రక్రియల్లో నిర్వహించిన పోటీలో గెలుపొందిన ఉత్తమ గ్రంథాలకు పురస్కారాల ప్రదానోత్సవం వైభవంగా జరిగింది. పరిషత్తు అధ్యక్షుడు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డా. జె.చెన్నయ్య, కోశాధికారి మంత్రి రామారావు, సభ్యులు డా. సి.వసుంధర, రింగు రామమూర్తి తదితరులతో కలిసి గెలుపొందిన ఉత్తమ గ్రంథాల రచయితలు పెండ్యాల కిషన్‌శర్మ, హనీఫ్‌లు, కథాప్రక్రియలో డా. టి.సంపత్‌కుమార్, నవలలో వి.శాంతి, విమర్శలో ఆడెపు లక్ష్మీపతిలకు పురస్కారాలతోపాటు ఒక్కొక్కరికి 20వేల రూపాయల నగదు బహుమతి, జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఇతర ప్రక్రియల్లో న్యాయనిర్ణేతల పరిశీలనలో సమానమైన స్థాయి పొందిన దేవనపల్లి వీణావాణి, హెచ్.రమేష్‌బాబు గ్రంథాలకు ఒక్కొక్కరికి 10వేల రూపాయల నగదు బహుమతిని అందజేశారు. ఈ సంవత్సరం విశిష్ట పురస్కారాల కింద ఆశారాజు, జూపాక సుభద్ర, వారాల ఆనంద్, గుడిపాటిలకు పరిషత్తు తరఫున పురస్కారాలతోపాటు 20వేల రూపాయల నగదు, జ్ఞాపిక, శాలువాతో సన్మానించారు. ముందుగా చెన్నయ్య స్వాగతోపన్యాసంలో తెలంగాణలో వివిధ ప్రక్రియల్లో తెలుగు సాహిత్యం ఉత్తమ ప్రమాణాలతో వెలువడుతుందని, తెలంగాణ జనజీవితం ఈ రచనల్లో మునుపటికన్నా ఆశాజనకంగా ఉందన్నారు. ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసంలో పరిషత్తు లోకనంది శంకర నారాయణరావు, సురవరం ప్రతాపరెడ్డి, దేవులపల్లి రామానుజరావు, నూకల నరోత్తమరెడ్డి, డా. సి.నారాయణరెడ్డి వంటి పెద్దలబాటలో కలకాలం నడుస్తుందని స్పష్టం చేశారు.

## బర్రెలను మేపడానికి వెళ్లిన వ్యక్తి చెరువులో శవమై తేలాడు



మృతిచెందిన ఆకుల సురేష్

దుండిగల్, మే26 ప్రభాతవార్త: బర్రెలను మేపడానికి వెళ్ళిన వ్యక్తి చెరువులో శవమై తేలిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధి లో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... బహదూర్‌పల్లి గ్రామానికి చెందిన ఆకుల రాములు రెండవ కుమారుడు ఆకుల సురేష్(26) ప్రతి రోజు బర్రెలను మేపడానికి వెళ్ళి సాయంత్రం 6గంటల సమయంలో ఇంటి తిరిగి వచ్చేవాడు. రోజూ మాదిరిగానే గురువారం బర్రెలను మేపడానికి వెళ్ళిన సురేష్ మధ్యాహ్నం భోజనం చేయడానికి ఇంటికి వచ్చి తిరిగి 3గంటల సమయంలో బర్రెలను తీసుకొని వెళ్ళాడు. సాయంత్రం 6గంటలు దాటినా కూడా సురేష్ ఇంటికి రాకపోవడంతో సోదరి రాధిక పలు మార్లు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అని వస్తోంది. అయితే రాత్రి 8గంటల సమయంలో రెండు బర్రెలు మాత్రం ఇంటికి చేరుకోగా మిగిలిన బర్రెలు రాకపోవడంతో సురేష్ కోసం చుట్టు పక్కల గాలిస్తున్న తండ్రి రాములుకు మరుసటి రోజు ఉదయం 6గంటలకు బహదూర్ పల్లి ఐస్ కంపెనీ సమీపంలో బర్రెలు కనిపించాయి. బర్రెలను ఇంటికి పంపించి చెరువు వైపు వెళ్తున్న క్రమంలో నీటిలో పైకి తేలిన మృతదేహం కనిపించడంతో బయటకు తీసిన రాములు తన కుమారుడి మృతదేహాన్ని గుర్తించి ఎంతో రోధించాడు. తన కుమారుడి మృతిపట్ల సందేహాలు ఉన్నాయని, దర్యాప్తు చేపట్టి తగిన న్యాయం చేయాలని రాములు దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## గానకోకిల పి.సుశీలకు నేడు ఘనంగా ఆత్మీయ సత్కారం

రవీంద్రభారతి, మే 26 ప్రభాతవార్త : విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు, శకపురుషుడు పద్మశ్రీ డా. నందమూరి తారక రామారావు శతజయంతిని పురస్కరించుకొని అమెరికాలోని ప్రవాస భారతీయ ప్రముఖులు శ్రీనివాస్ చిమట, శ్రీరామ్ సుంకరల సౌజన్యంతో ఈరోజు 27వ తేదీ శనివారం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ప్రముఖ బృందావనం సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ప్రఖ్యాత సినీనేపథ్య గాయని, గానకోకిల పి.సుశీలకు ఆత్మీయ సత్కారం చేయనున్నట్లు నిర్వాహకులు గొర్తి చంద్రశేఖర్, వై.సుబ్రహ్మణ్యంలు మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు శీర్షికన ప్రఖ్యాత గాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, ఎస్.జానకి తదితరులు ఆలపించిన ఆణిముత్యాల్లాంటి ఎన్టీఆర్ చలనచిత్ర గీతాలతో స్వరాభిషేకం పేరిట వర్ధమాన గాయకులచే సినీసంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సంగీత దర్శకుడు రామాచారి, ఎస్‌బిఐ డిజీఎం వెంకట్ గరికపాటి తదితరులు పాల్గొననున్నారు.

## నూతన పార్లమెంట్ భవనానికి గాంధీ పేరు పెట్టాలి

**తెలంగాణ న్యాయవాద జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి**

ధర్నాచౌక్, మే 26, ప్రభాతవార్త: నూతన పార్లమెంట్ భవనానికి మన జాతిపిత మహాత్మాగాంధీ పేరు పెట్టటం సముచితంగా ఉంటుందని తెలంగాణ న్యాయవాద జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. శుక్రవారం కవాడిగూడలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యమే దేశానికి శ్రీరామరక్షగా భావించి, ఎందరో ప్రపంచ నాయకులకు ప్రేరణగా నిలిచిన గాంధీ భారత స్వతంత్ర్యోద్యమంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకుని, సత్యాగ్రహం పేరుతో శాంతియుతంగా పోరాడి, అహింసను మించిన ఆయుధం లేదని ప్రపంచానికి చాటిచెప్పిన గాంధీ భవిష్యత్‌తరాలకు కూడా మార్గదర్శకుడని కొనియాడారు. అటువంటి మహనీయునికి సముచిత స్థానం కల్పించాలంటే మన నూతన పార్లమెంటు భవనానికి మహాత్మాగాంధీ పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు.

## రహదారులపై క్రమశిక్షణగా వ్యవహరించాలి

**అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ జి.శంకర్‌రాజు**



అవగాహనా కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎసిపి జి.శంకర్‌రాజు

ధర్నాచౌక్, మే 26, ప్రభాతవార్త: రహదారులపై ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో వ్యవహరించాలని అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ జి.శంకర్‌రాజు (ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, బేగంపేట్) సూచించారు. శుక్రవారం దోమలగూడలోని సాదూరాం కంటి ఆసుపత్రిలో నారాయణగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ స్టేషన్ లిమిట్స్‌లో రోడ్డు భద్రత ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌రాజు మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు నడపటానికి ఇవ్వటం చట్ట ప్రకారం నేరమని, 18 సంవత్సరాలు నిండిన యువత డ్రైవింగ్ లైసెన్స్ పొందిన తరువాతనే వాహనాలు నడపాలని స్పష్టం చేశారు. వాహనాలకు ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు తప్పకుండా ఉండాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. వేగం కన్నా ప్రాణం మిన్న అని గుర్తు పెట్టుకోవాలని, అతివేగంతో ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించి వాహనాలు నడపటం వల్ల ప్రమాదాలు జరుగుతూ ఇరువైపుల వారికి ఆరోగ్య, ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవిస్తున్నాయని అన్నారు. వంద మంది సాదూరాం హాస్పటల్ సిబ్బందితో జరిగిన ఈ అవగాహనా కార్యక్రమంలో బేగంపేట్ టీటీఐ స్టాఫ్ వీరమ్మ, కృష్ణ, నర్సింహల ఆధ్వర్యంలో జరిగింది.

## చిలుకలగూడ నూతన ఇన్స్‌పెక్టర్‌ను కలిసిన మెట్టుగూడ బిజెపి నేతలు




ఇన్స్‌పెక్టర్ మట్టం రాజును శాలువాతో సన్మానిస్తున్న బిజేపీ నేతలు

మెట్టుగూడ, మే 26 ప్రభాతవార్త: ఇటీవల నూతన ఇన్స్‌పెక్టర్‌గా పదవీ భాద్యతలు స్వీకరించిన మట్టం రాజును మెట్టుగూడ డివిజన్‌కు చెందిన పలువురు బిజేపీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యదర్శి సి.రాజేష్ ముదిరాజ్, నాయకులు బాబు, ఆదర్శ్, వరుణ్, గోపి, శ్రీనాథ్, శ్రీను, వినోద్, మంజుల, అనుష తదితరులు ఇన్స్‌పెక్టర్‌కు బొకే అందజేసి శాలువాకప్పి సన్మానించి కృతజ్ఞతలు చెప్పారు.

## కంటోన్మెంట్ మహిళల అభ్యున్నతికి నిరంతరం కృషి

**బిఆర్ఎస్ నేత ఎన్.శ్రీగణేష్**



5వ వార్డు గాంధీ నగర్‌లో మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న బిఆర్ఎస్ నేత శ్రీగణేష్ తదితరులు

కంటోన్మెంట్,మే 26 ప్రభాతవార్త: కంటోన్మెంట్ మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందేందుకు తన సొంత నిధులతో పలు శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు బిఆర్ఎస్ నేత ఎన్.శ్రీగణేష్ తెలిపారు. కంటోన్మెంట్ 5వ వార్డులోని గాంధీ నగర్‌లో మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండా తమ పిల్లల భవిష్యత్తు కోసం స్వయం ఉపాధి పథకం కింద అభివృద్ధి చెందేందుకు ఎంబ్రాయిడరీ, కుట్టు శిక్షణ, పాపడాల తయారీ వంటి శిక్షణలు ఇచ్చి మిషన్లకు కూడా అందజేస్తున్నామన్నారు. తనకు ఏ పదవి బాధ్యతలు లేకున్నా మహిళా సాధికారతకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బిఆర్ఎస్ నాయకులు శరత్, గౌతమ్, విక్కీ, భాస్కర్ గౌడ్, బిక్షపతి, సునీత, తివారీ, సంతోషి, సంధ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

## యుగపురుషుడు నందమూరి తారక రామారావు

**డా. సముద్రాల వేణుగోపాలాచారి**



సత్కారం పొందిన ఎన్టీఆర్ జీవితచరిత్ర రచయితలు భగీరథ, రామకృష్ణలతో వేణుగోపాలాచారి, రాజగోపాలరావు

నాంపల్లి, మే 26 ప్రభాతవార్త : శక పురుషుడు, సమైక్య ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పూర్వ ముఖ్యమంత్రి, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ డా. ఎన్.టి.రామారావు యుగపురుషుడని తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డా. సముద్రాల వేణుగోపాలాచారి కొనియాడారు. శతజయంతి మహోత్సవాల 3రోజుల ముగింపు వేడుకలను పురస్కరించుకొని నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో రెండవరోజు డా. ఎన్.టి.ఆర్ జీవిత చరిత్ర రచయితలు భగీరథ, అల్లాడ రామకృష్ణల సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. సముద్రాల వేణుగోపాలాచారి గౌరవ అతిథులు తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి.రాజగోపాలరావు, సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురామ్, సుబ్బారావు, సతీష్ తదితరులతో కలిసి భగీరథ రచించిన మహానటుడు, ప్రజానాయకుడు ఎన్.టి.ఆర్ పుస్తకానికిగాను, అల్లాడ రామకృష్ణ రచించిన ఈ శతాబ్ది హీరో-నాయకుడు-భారతీయుడు పుస్తకానికిగాను ఇరువురిని ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించి డా. నందమూరి తారక రామారావు మహోన్నత వ్యక్తిత్వం, తనకుతానే అన్నరీతిలోని ఆయన అద్భుత నటన, రాజకీయ ప్రస్థానం, గొప్పనాయకుడు సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేసిన అనితరసాధ్యమైన ప్రజాసేవను వర్ణించి ఘననివాళులర్పించారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ దుర్మరణం

పేట్‌బషీరాబాద్, మే 26 ప్రభాతవార్త: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మహిళను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడేమృతి చెందిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... మల్లన్న తాండా దేవరాయ ఆంజల్ గ్రామనికి చెందిన రత్నమ్మ(47) గురువారం రాత్రి సుమారు 10:30గంటల సమయంలో మరాఠా బస్తీ నుంచి తన ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సమీపంలో ఒక గుర్తు తెలియని వాహనం అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదం లో రత్నమ్మ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. అదే దారిలో వెళ్తున్న మల్లన్న తాండాకు చెందిన వ్యక్తి రత్నమ్మ కుమారుడు భీమానాయక్‌కు ఫోన్‌లో సమాచారం అందించాడు. ఈ ప్రమాదంపై దర్యాప్తు చేపట్టి మృతికి కారణమైన గుర్తు తెలియని వ్యక్తిపై తగిన చర్యలు తీసుకోవాలని పేట్‌బషీరాబాద్ పోలీసులకు మృతురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# సొంత గూటికి మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి

**మాజీ ఎమ్మెల్యే రాకతో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం**
**పిఎస్ఆర్ అభిమానుల్లో నూతనోత్సాహం**
**మెదక్ జిల్లాలో పుంజుకోనున్న కాంగ్రెస్**



శశిధర్‌రెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పిసిసి ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, రేవంత్‌రెడ్డి తదితరులు

**సంగారెడ్డి బ్యూరో, మే 26, ప్రభాతవార్త:** మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ళ శశిధర్‌రెడ్డి శుక్రవారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. శశిధర్ రెడ్డి రాకతో మెదక్ జిల్లాతో పాటు మెదక్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వచ్చే అవకాశం ఉందని పలువురు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే హైదరాబాద్‌లోని గాంధీ భవన్ లో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇంచార్జ్ మాణిక్‌రావు ఠాక్రే, పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యం మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించి సభ్యత్వాన్ని అందజేశారు. ఇదిలా ఉండగా శశిధర్‌రెడ్డి రాకతో మెదక్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతం అయ్యే అవకాశం ఉందని, అధికార పార్టీని ఢీకొట్టేందుకు శశిధర్‌రెడ్డి సేవలు కాంగ్రెస్ పార్టీకి ఎంతో ఉపయోగపడతాయని పలువురుఅభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ళ శశిధర్‌రెడ్డి చేరికతో ఆయన అభిమానులు, కాంగ్రెస్ ద్వితీయ శ్రేణులు ఆనందం వ్యక్తపరుస్తున్నారు. ఇప్పటికే మెదక్ నియోజకవర్గంలో డిసిసిఅధ్యక్షులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, పిసిసి సభ్యులు మ్యాడం బాలకృష్ణ, సుప్రభాతరావులాంటి వారు ఎవరికివారే యమునతీరే అనేవిధంగా తమ తమ గ్రూపులను తయారు చేసుకొని పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో పని చేసి పార్టీ తనకు సరైన గుర్తింపు ఇవ్వకపోవడంతో శశిధర్‌రెడ్డి బిజెపిలోకి వెళ్లారు. తిరిగి బిజెపికి రాజీనామాచేసి స్తబ్దతగా ఉన్నారు. అయితే టిఆర్ఎస్‌లో చేరుతారనే ఊహాగానాలు వచ్చినప్పటికీ తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి రావడం జరిగింది. దీంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు శశిధర్‌రెడ్డితో ఎంత వరకు కలిసిపోతారో చూడాల్సిన పరిస్థితి ఉంది. అయితే నియోజకవర్గంలోని చాలా మంది కాంగ్రెస్ పార్టీ జెండాపై గెలిచి టిఆర్ఎస్‌లోకి వెళ్లిన వారు సైతం శశిధర్‌రెడ్డి రాకతో తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని పలువురు సీనియర్ నాయకులు తెలిపారు.



బిఆర్ఎస్ గ్రామ నూతన కమిటీలు

## బిఆర్ఎస్ విద్యార్థి, యువజన, సోషల్ మీడియా కమిటీల నియామకం

**తొగుట, మే 26, ప్రభాతవార్త :** మండల పరిధిలోని గుడికందుల, గోవర్ధనగిరి గ్రామాలలో బిఆర్ఎస్ విద్యార్థి, యువజన, సోషల్‌మీడియా కమిటీలను శుక్రవారం నియమించారు. గుడికందుల యూత్‌అధ్యక్షుడిగా గోనెపల్లి యాదగిరిగౌడ్, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా మారుపల్లి అరవింద్‌గౌడ్, సోషల్ మీడియా అధ్యక్షుడిగా కొలుపుల బీరయ్యలను ఎన్నుకున్నారు. గోవర్ధనగిరి యూత్ అధ్యక్షుడిగా మండల కుమార్, విద్యార్థి విభాగం అధ్యక్షులుగా ఉప్పరి నరేష్, సోషల్ మీడియా అధ్యక్షులుగా నంట సతీష్ రెడ్డిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ హరికృష్ణరెడ్డి, సర్పంచ్‌లు గంగనిగాళ్ల మల్లయ్య, తోయేటి ఎల్లయ్య, నాయకులు అనిల్ కుమార్, పరమేశ్వరరెడ్డి, బండారు రమేష్‌గౌడ్, అరుణ్‌కుమార్, బైరగౌడ్, బైరారెడ్డి, కోల శ్రీకాంత్, బాలరాజు, శ్రీనివాస్, రాజశేఖర్, రమేష్‌గౌడ్, కృష్ణ పాల్గొన్నారు.

## యువజన కాంగ్రెస్ మండల ప్రధానకార్యదర్శిగా శ్రీకాంత్



శ్రీకాంత్‌కు నియామకం పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

**కోహెడ, మే 26, ప్రభాతవార్త :** రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంతో పాటు అధికారంలోకి తీసుకరావడమే లక్ష్యంగా పని చేద్దామని యువజన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సీసీపల్లి గ్రామానికి చెందిన ఎల్లాబోయిన శ్రీకాంత్‌ను యువజన కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ నియామకం పత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్నివర్గాలలకు న్యాయం జరుగుతుందన్నారు. యువజన కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శిగా నియామకమైన శ్రీకాంత్ మాట్లాడుతూ పార్టీ పటిష్టత కోసం కృషిచేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి పదవి రావడానికి సహకరించిన పొన్నం ప్రభాకర్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, అంక్ష రెడ్డి, రాకేష్, మంద ధర్మయ్య, దూలం శ్రీనివాస్‌గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, శ్రీనివాస్, నంగునూరి శ్రీనివాస్, చందు, వెంకటస్వామి, రాకేష్, ఎల్లయ్య, వెంకట్ పాల్గొన్నారు.

## చౌదరిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



చౌదరిపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

**వర్గల్, మే 26 (ప్రభాతవార్త):** ప్రతి ఒక్క రైతు కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వర్గల్ మండలం చౌదరిపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుండి సేకరించే ధాన్యానికి ప్రభుత్వం గిట్టుబాటు ధర అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి బాలమల్లుయాదవ్, ఎంపిపి లతారమేష్‌గౌడ్, పిఏసిఎస్ చైర్మన్ ఇర్రి రామకృష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వేలూరి వెంకట్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు నాగరాజు, సర్పంచ్ లలిత శంకర్‌గౌడ్, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌గుప్త, స్వామి, రాజశేఖర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## కంటి వెలుగు చారిత్రాత్మకం: మున్సిపల్ చైర్మన్

**గజ్వేల్, మే 26 (ప్రభాతవార్త):** కంటి వెలుగు కార్యక్రమం చారిత్రాత్మకమని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని 18వ వార్డులో గల జిడిఆర్ పాఠశాలలో శుక్రవారం ఏర్పాటుచేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం కెసిఆర్ మానస పుత్రిక కంటి వెలుగు కార్యక్రమం అని, రానున్న రోజుల్లో చరిత్రలో నిలిచిపోతుందన్నారు. రెండో విడత కంటివెలుగు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని, 18వ వార్డులో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐవిఎఫ్ జిల్లా యువజన అధ్యక్షుడు ఎన్‌సి.సంతోష్, 18వ వార్డు బిఆర్ఎస్ అధ్యక్షుడు గొంగల్ల శ్రీను, శ్రీధర్, అమరేందర్, కొమురవెల్లి ప్రవీణ్, రాజారాం, భాస్కర్, దాసు, గోపాల్‌రెడ్డి, విష్ణు, దయానంద్, సంపత్, వినయ్, వైద్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## విఓఎల సమస్యలను పరిష్కరించాలి



నిరసనలో భాగంగా రోడ్లు శుభ్రం చేస్తున్న విఓఎలు

**కొండపాక, మే 26, ప్రభాతవార్త :** ఐకెపి విఓఎల సమస్యలను పరిష్కరించాలని 22 రోజులుగా చేస్తున్న నిరసనలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద విఓఎలు రోడ్లు శుభ్రం చేసి నిరసన వ్యక్తం చేసి ప్రభుత్వ వ్యతిరేకతను చాటుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ గత 22 రోజులుగా నిరసన తెలిపిన ప్రభుత్వంలో చలనం లేదన్నారు. సమస్యలను పరిష్కంరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని తెలిపారు. ఇప్పటికైన తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యాదయ్య, రాములు, సర్వయ్య, నాగలక్ష్మి, లక్ష్మి, లావణ్య, కవిత తదితరులు పాల్గొన్నారు.

### దుర్గామాత దేవాలయ నిర్మాణానికి రూ.50వేలు విరాళం

**జగదేవ్‌పూర్, మే 26 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని ధర్మారం గ్రామంలో దుర్గా మాత నూతన దేవాలయ నిర్మాణం జరుగుతుండగా ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి రూ.50 వేలను విరాళంగా జగదేవ్‌పూర్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పంగట్ల శ్రీనివాస్‌గౌడ్ ద్వారా శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు, ఆపదలో ఉన్న వారికి ఆర్థిక సహాయం చేస్తూ ప్రజల గుండెల్లో నిలుస్తున్న నాయకులు ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. స్థానిక సర్పంచ్ పిట్టల రాజు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి వంటేరు ప్రతాప్‌రెడ్డి విరాళం అందజేసినందుకు వారికి గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఎక్బాల్, స్థానిక సర్పంచ్ పిట్టల రాజు, జగదేవ్‌పూర్ ఉపసర్పంచ్ బింగి మల్లేశం, కొండ పోచమ్మ ఆలయ డైరెక్టర్ కుమ్మరి కనకయ్య, ఆత్మ కమిటీ డైరెక్టర్ ఐలయ్య, గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షుడు ఆంజనేయులు, కో–ఆప్షన్ కృష్ణా గౌడ్, నాయకులు శ్రీశైలం, కృష్ణ, ప్రశాంత్, రాజు, పోచయ్య, మల్లేశ్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## మార్కండేయ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గనికి బాధ్యతలు అప్పగిస్తున్న దృశ్యం

**కొండపాక, మే 26, ప్రభాతవార్త :** దుద్దెడ మార్కండేయ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గన్ని శుక్రవారం ఏన్నుకున్నట్లు అ సంఘం నాయకులు తెలిపారు. శుక్రవారం సంఘం నాయకుడు బొజ్జ నారాయణ పర్యవేక్షణలో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షునిగా బొజ్జ మహాదేవ్, ఉపాధ్యక్షుడుగా వడ్లకొండ శ్రీహరి, ప్రధానకార్యదర్శిగా చెలిగాని శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా వైద్యుల లక్ష్మినారాయణ, కోశాధికారిగా వడ్డకొండ వాసుదేవ్ లను, సలహాదారులుగా వడ్లకొండ శ్రీనివాస్, బొజ్జ చక్రధర్, వడ్లకొడ పెద్ది శ్రీనివాస్ కార్యవర్గ సభ్యులుగా బింగి బిక్షపతి, కుచన్ రాములు, బింగి వేణులను ఏన్నికైనట్లు తెలిపారు. ఎన్నిక అనంతరం సంఘం మాజీ అధ్యక్షుడు నూతనంగా ఎన్నికైన కార్యవర్గనికి బాధ్యతలను అప్పగించారు.

## దాతల సహకారంతో తాగునీరు ఏర్పాటు



ఆలయం వద్ద బోరు మోటారును ప్రారంభించిన దృశ్యం

**జగదేవ్‌పూర్, మే 26 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలోని శ్రీభ్రమరాంభిక మల్లికార్జునస్వామి దేవాలయం వద్ద తాగునీరు లేకపోవడంతో భక్తులు పలు ఇబ్బందులకు గురవుతున్న విషయం తెలుసుకున్న చాట్లపల్లి సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రాచర్ల నరేష్ సొంత డబ్బులతో నూతన బోరు బావి తవ్వించగా చాట్లపల్లి గ్రామానికి చెందిన రాచర్ల లక్ష్మణ్ నూతన బోరు మోటార్‌ను బిగించి భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించారు. ఆలయం వద్ద భక్తుల కోసం బోరు వేయించడం సంతోషకరమని, దీనికి కృషిచేసిన నాయకులకు ఆలయ కమిటీ తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

## సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాలకు వంద సీట్లు మంజూరు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** సిద్దిపేట జిల్లా వైద్యరంగంలో రోజురోజుకూ ముందుకు సాగుతుంది. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కళాశాలతోపాటు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఏర్పాటుతో వైద్య రంగంలో పురోగతి సాధిస్తుంది. సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాలకు 2023–24 విద్యా సంవత్సరానికి గానూ ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ వం సీట్లను మంజూరు చేసినట్లు ఉత్తర్వు లో పేర్కొన్నారు. 2021–22 విద్యా సంవత్సరంలో మొదటి సంవ త్సరం వంద మంది నర్సింగ్ విద్యార్థులు, 2022–23 విద్యా సంవ త్సరానికి వందమంది నర్సింగ్ విద్యార్థులు అడ్మిషన్ తీసుకొని ప్రస్తుతం 200 మంది నర్సింగ్ విద్యార్థులు నర్సింగ్ విద్యను అభ్యసిస్తున్నారు. కాగా ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ కోటాలో సీట్లు మంజూరు కోసం కళాశాల యాజమాన్యం దరఖాస్తు చేసుకోగా ఈనె 8,9వ తేదీల్లో రెండు రోజుల పాటు ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ అధికారులు సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను పరిశీలించారు. సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాలకు ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ వంద సీట్లను మంజూరు చేసింది. కాగా రూ.50 కోట్లతో రాష్ట్ర అర్థిక, అరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు ప్రత్యేక చొరవతో జిల్లా కేంద్రంలోని కరీంనగర్ రోడ్డులో 3 ఎకరాల స్థలంలో 6 అంతస్తుల నర్సింగ్ కళాశాల భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ యేడు జూన్ వరకు భవన నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకరావడానికి అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారు. వంద సీట్లు మంజూరు కావడంతో వచ్చే విద్యా సంవత్సరం మొత్తం 300 మంది నర్సింగ్ విద్యార్థులు నర్సింగ్ విద్యను అభ్యసించనున్నారు.

## నర్సాపూర్‌లో అంబలి పంపిణీ

**నర్సాపూర్, మే 26.ప్రభాతవార్త:** వేసవీ కాలం అయినందున తనవంతు సహాయంగా ప్రజలకు ఎండ వేడిమి నుండి కాపాడటానికి గాను ప్రజల దాహార్తిని తీర్చడానికిగాను నర్సాపూర్ పట్టణానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు మాజీ వార్డు సభ్యులు నాగరాజు గౌడ్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్రతి శుక్రవారం రోజున బస్టాండ్ సమీపంలో అంబలి కేంద్రాన్ని నిర్వహించి అంబిలిని పంపిణీ చేస్తున్నారు. బిఆర్ఎస్ నాయకులు నాగరాజుగౌడ్ తన తల్లిదండ్రులు వెంకటస్వామిగౌడ్ కమలమ్మల పేరిట ఈ అంబలి కేంద్రాన్ని నిర్వహించి ఈ వేసవీ కాలం మొత్తం ప్రతి శుక్రవారం నిర్వహిస్తు ప్రజలకు అంబలిని పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు నాగరాజుగౌడ్ అందిస్తున్న అంబలి కేంద్రం నిర్వహించడం వేసవీ కాలంలో దాహార్తిని తీర్చడం అభినందనీయమని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

### దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా రైతు సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

**కడ్తాల్, మే 26 ప్రభాతవార్త :** భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పథకాలు అమలుచేస్తున్న ఘనత ముఖ్యమంత్రి కెసిఆర్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వా నిదేనని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. కడ్తాల్ పట్టణంలో శుక్రవారం ఎంబిఎ గార్డెన్‌లో విజయ డైరీ పాడి రైతులకు బ్యాంకు రుణాలపై అవగాహన సదస్సు కార్యక్రమానికి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని రైతులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సహకారంతో ఎస్‌బి ఐ బ్యాంకు నుండి రైతులకు ముద్రలోన్ 50 వేల నుండి పది లక్షల వరకు పాడిపరి శ్రమ అభివృద్ధి కోసం రుణాలు అందజేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని వారన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు ఏర్పాటు చేసి రైతుల జీవన విధానాన్ని పెంపొందించారని రైతులకోసం 24 గంటల ఉచిత కరెంటు, రైతుబంధు, రైతు ఇన్సూరెన్స్ మిషన్ కాకతీయతో చెరువుల నుంచి భూగర్భ జలాలు వృద్ధిచెంది వ్యవసాయం దేశంలో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచిందని జైపాల్ యాదవ్ అన్నారు. కార్యక్రమంలో జడ్పీటిసి దశరథ్‌నాయక్, రంగారెడ్డి,నాగర్‌కర్నూల్ డీడీలు శివల్‌కర్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

## ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

**హుస్నాబాద్ రూరల్, మే 26,ప్రభాతవార్త :** ప్రజల ఆరోగ్యమే బిఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయం అని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అన్నారు. శుక్రవారం రోజున మండలంలోని మీర్జాపూర్ గ్రామంలో రూ 2కోట్లతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవననిర్మానానికి భూమిపూజ కార్యక్రమానికి హాజరైన ఆయన కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని, అనారోగ్య సమస్యలు ఉన్న వారికి ప్రభుత్వ ఆసుపత్రులలో కార్పొరేట్‌స్థాయి వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. సాధారణ జబ్బులతో బాదపడే వారు దూర ప్రాంతాలకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోకూడదనే ఉద్దేశంతోనే మంత్రి హరీష్‌రావు చొవరతో మీర్జాపూర్‌లో ఈ ఆసుపత్రిని ప్రారంభించడంతో పాటు నేడు పక్క భవనానికి భూమిపూజ చేసినట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి లకావత్ మానససుభాష్, ఆ గ్రామ సర్పంచ్ తరాల లతమహేందర్, మార్కెట్ కమిటి చైర్మెన్ ఎడబోయిన రజినితిరుపతిరెడ్డి, జడ్పిటిసి భూక్య మంగశ్రీనివాస్, డిప్యూటీ డిఎం అండ్ హెచ్‌వో కస్తూరి సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

**ఎంసెట్‌లో ప్రతిభ చాటిన విద్యార్థిని సన్మానించిన ఎమ్మెల్యే...**

చిగురుమామిడి మండలంలోని సుందరగిరి గ్రామానికి చెందిన శ్రీమూర్తి అభిరామ్ ఎంసెట్ (ఇంజనీరింగ్ విభాగం)లో 4747వ ర్యాంక్ సాధించిన సందర్భంగా విద్యార్థిని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ శుక్రవారం హుస్నాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో విద్యార్థిని శాలువాతో సన్మానించి అభినందించారు.

## విజయవంతమైన కంటి వెలుగు

**హుస్నాబాద్, మే 7,ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమం శుక్రవారంతో మండల వ్యాప్తంగా విజయవంతం అయిందని ఎంపిపి లకావత్ మానససుభాష్ అన్నారు. ఈనేపధ్యంలో మండలంలోని వంగరామయ్యపల్లి గ్రామ పంచాయితీలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు వంగ విజయలక్ష్మివెంకటరామిరెడ్డి, తరాల లతమహేందర్, ఇస్లావత్ రజిత, లావుద్య స్వరూప లింగానాయక్, ఎంపిటిసిలతో కలసి కంటి వెలుగును విజయవంతం చేసిన వైద్య సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఅండ్ హెచ్‌వో కస్తూరి సౌమ్యతో పాటు వైద్యులు పాల్గొన్నారు.

## బిజెపి బలోపేతానికి కృషి చేయాలి

**నర్సాపూర్ అసెంబ్లీ కన్వీనర్ వాల్దాస్ మల్లేష్‌గౌడ్**



మాట్లాడుతున్న వాల్దాస్ మల్లేష్‌గౌడ్

**నర్సాపూర్, మే 26 ప్రభాతవార్త:** బిజెపి బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ నర్సాపూర్ అసెంబ్లీ కన్వీనర్ వాల్దాస్ మల్లేష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం నర్సాపూర్‌లోని బిజెపి పార్టీ కార్యాలయంలో మండల బిజెపి కార్యవర్గ సమావేశాన్ని మండల ప్రధానకార్యదర్శి నగేష్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న నర్సాపూర్ అసెంబ్లీ బిజెపి కన్వీనర్ వాల్దాస్ మల్లేష్‌గౌడ్ మాట్లాడుతూ బిజెపి పార్టీ భలోపేతమే లక్ష్యంగా పనిచేసే విదంగా ప్రతి ఒక్క నాయకులు కష్టపడి పని చేయాలన్నారు. ఈ మండల కార్యవర్గ సమావేశం ప్రతి మూడు నెలలకొకసారి నిర్వహించడం జరుగుతుందన్నారు. మే నెల 30 నుండి జూన్ 30 వరకు మహజన సంపర్గ్ అబియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం రాష్ట్రస్థాయి నుండి భూత్ స్థాయి వరకు చేయవల్సిన కార్యక్రమాలను ఆయన వివరించారు. ఈ మేరకు కెసిఆర్ ప్రభుత్వం చెరువుల్లో వేసే చేప పిల్లలను కేంద్ర ప్రభుత్వం ద్వార ముదిరాజ్‌ల, గంగపుత్రుల సంక్షేమం కోసం ప్రధాని నరేంద్రమోడి పంపిస్తున్నారని తెలిపారు. ఈ విదంగా ఎన్నో సంక్షేమ పథకాలు క్రెంద్రం నుండి పంపిస్తే కెసిఆర్ ప్రభుత్వమే ఈ పథకాలన్ని చేపడుతున్నామని గొప్పలు చెప్పుకుంటున్నాడని అన్నారు. ఈమేరకు కార్యకర్తలు, నాయకులు కేంద్ర ప్రభుత్వ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేయ వల్సిన అవసరం ఎంతైనా ఉందని నర్సాపూర్ అసెంబ్లీ బిజెపి కన్వీనర్ వాల్దాస్ మల్లేష్‌గౌడ్ సూచించారు ఈ కార్యక్రమంలో వివిద బిజెపి మోర్చాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, శక్తి కేంద్రాల ఇంచార్జీలు, సీనియర్ బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

**యాచారం, మే 26 ప్రభాతవార్త :** మండల పరిధిలోని మ ంతన్‌గౌరెల్లి గ్రామంలో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించి, ధాన్యాన్ని దగ్ధంచేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు, మాజీ ఎంపిటిసి తావునాయక్, సిపిఎం మండల కార్యవర్గసభ్యులు చందునాయక్‌లు మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి ప ండించిన వరి పంటకు గిట్టుబాటు ధర లేదన్నారు. గ్రామంలో గతంలో 40 కెజిల బస్తాకు ఒక కిలో తరుగు తీసేవారని, మధ్యలో గిట్టుబాటు కావడం లేదంటూ రెండు కిలోల తరుగుతో కొనుగోలు చేస్తామని నిర్వాహకులు చెబుతున్నారన్నారు. ప్రస్తుతం అధికారులు 40 కిలోల బస్తాకు ఐదు కెజిల తరుగు తీస్తున్నారని రైతులతో కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. 5 కెజిల తరుగు తీయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నా రని ఆందోళన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి నెల రోజులు గడుస్తున్నా ధాన్యం రాశులు కుప్పలుగా పేరుకుపోయాయని, దీంతో అకాల వర్షాలకు ధాన్యం తడిచిపోయిందన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే రైతులు అప్పులపాలై వారి భాదలు ఎవరికి చెప్పుకోలేని పరిస్థితిలో ఉన్నారని ఆందోళన చెందుతున్నా రన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఒక కెజి తరుగుతో ధాన్యం కొనుగోలు చేయాలన్నారు.



కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

## పేదింటి ఆడబిడ్డకు మేనమామ సిఎం కెసిఆర్

**-ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్**

**అక్కన్నపేట, మే 26, ప్రభాతవార్త :** పేదింటి ఆడబిడ్డలకు మేనమామ సిఎం కేసిఆర్ అని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో 45 మందికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్కన్నపేట మండల వ్యాప్తంగా 1594 మంది లబ్దిదారులకు 14కోట్ల 58లక్షల 75వేల 432 రూపాయలు అందజేశామన్నారు. సిఎం కేసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అన్ని వర్గాలకు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మాలోతు లక్ష్మిభీలునాయక్, జడ్పిటిసి భూక్య మంగశ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మెన్ ఎడబోయిన రజిని తిరుపతిరెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెసరు సాంబరాజు, తహసీల్దార్ సంజీవ్‌కుమార్, సర్పంచ్‌లు బొమ్మగాని రాజేశం, అశ్వినిహేమురాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

**త్వరలో అక్కన్నపేట వ్యవసాయ సబ్ మార్కెట్...**

త్వరలో అక్కన్నపేట మండలానికి వ్యవసాయ సబ్‌మార్కెట్ ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే సతీష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని మార్కెట్ యార్డులో చిగురుమామిడి మండలానికి 20పా ్యడి క్లీనర్‌లను పిఎసిఎస్, ఏకెపి, డిసిఎమ్ఎస్ వారికి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్కన్నపేట ఇటీవలనే వ్యవసాయ సబ్‌మార్కెట్ మంజూరైందని త్వరలోనే దానిని ప్రారంభిస్తామన్నారు.

## 'మహాజన్ సంపర్క్ అభియాన్'ను విజయవంతం చేయాలి

**బిజెపి నాయకులు శ్రీరాంచక్రవర్తి, సురేందర్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి నాయకులు

**కోహెడ, మే 26, ప్రభాతవార్త:** ప్రధాన మంత్రి మోడీ తొమ్మిదేళ్ల మచ్చ లేని పాలనపై ఈనెల 30 నుంచి జూన్ 30 వరకు మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బిజెపి పార్టీ నాయకులు బొమ్మ శ్రీరాంచక్రవర్తి, జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. బిజెపి మండల కార్యవర్గ సమావేశం శుక్రవారం పార్టీ మండల అధ్యక్షులు ఖమ్మం వెంకటేశం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడారు. ప్రధాన మంత్రి మోడీ పేదలు, రైతుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, దేశాభివృద్ధి కోసం చేపట్టిన అభివృద్ధి పనులను ఇంటింటికి తీసుకెళ్లి వివరించాలన్నారు. మహాజన సంపర్క్ అభియాన్ మండలంలోని 27 గ్రామాల్లో 50 పోలింగ్ బూత్‌లలో విజయవంతం చేసేందుకు 20 శక్తి కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మండలంలోని ప్రతి కార్యకర్త ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నర్సయ్యగౌడ్, రమేష్, శ్రీనివాస్, తిరుపతి, సురేందర్‌రెడ్డి, లింగయ్య, రామచంద్రారెడ్డి, శివకుమార్‌గౌడ్, సత్యనారాయణరెడ్డి, రవీందర్, రాజుచారి, రాజు, సురేష్‌గౌడ్, రాములు, నరేష్, మహేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## వేలూరులో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం ప్రారంభం

**వర్గల్, మే 26 ప్రభాతవార్త :** వర్గల్ మండలం వేలూరు గ్రామంలో శుక్రవారం ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను ఈ కేంద్రంలో విక్రయించడం జరుగుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ప్రయోజనం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎరువుల విక్రయ కేంద్రం నిర్వాహకులు మధుసూదన్‌రెడ్డి, వేలూరు గ్రామ సర్పంచ్ పాపిరెడ్డి, జెడ్‌పిటిసి బాలమల్లుయాదవ్, ఎంపిపి లతారమేష్‌గౌడ్, పిఏసిఎస్ చైర్మన్ ఇర్రి రామకృష్ణారెడ్డి, ఎంపిటిసి సందీప్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు నాగరాజు, మండల వ్యవసాయాధికారి శేషు శయన, మండల బిసిసెల్ అధ్యక్షుడు మురళీగౌడ్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

### రైతుల నుంచి రంగుమారిన వడ్లు కొనుగోలు చేయాలి

**ఘట్‌కేసర్, మే 26, ప్రభాతవార్త:** ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని మేడ్చల్ జడ్పీచైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులను ప్రశ్నిం చారు. పలు అంశాలపై అధికారుల పూర్తి సమాచారంతో రాకపోవడంతో జడ్పీచైర్మన్, ఎంపిపిలు అసం తృప్తి వ్యక్తం చేశారు. ఎదులాబాద్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్లు కొనుగోలు చేయకపోవ డంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని ఎంపిటిసి గట్టగళ్ల రవి పేర్కొన్నారు. రంగుమారిన వడ్లను కొనుగోలు చేయాలని సీఎం కేసిఆర్ ఆదేశించినా అధికారులు కొర్రీలు పెడుతూ ధాన్యం సేకరించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఎంపిపి అసంతృప్తి వ్యక్తం చేశారు. మిషన్‌భగీరథ పథకం ద్వారా వందల కోట్ల రుపా యలు ఖర్చు చేస్తున్నారని కానీ ప్రజలకు నీటిని అందించకుండా బిల్లులు మాత్రం పంపుతున్నారని పేర్కొన్నారు. పల్లె దవాఖానాలు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం లేదని దీంతో రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారని ఆరోగ్యమంత్రి హరీష్‌రావు ప్రకటించినట్లుగా 50 పరీక్షలు, 150 రకాల మందులు ఇవ్వాలని ఎంపిపి కోరారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి

**కొండపాక, మే 26, ప్రభాతవార్త:** రాజీవ్ రహదారిపై త్రీ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని రిలయెన్స్ పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు డివైడర్ చెట్ల వద్ద పని చేస్తున్న మహిళ కూలీని దుబ్బాకకు చెందిన అర్టీసి బస్సు ఢీ కొనడంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కొండపాక గ్రామానికి చెందిన లక్ష్మీ అనే మహిళ రోడ్డు డివైడర్ చెట్ల వద్ద కూలీ పనులు చేస్తుండగా అర్టీసి బస్సు ఢీ కొట్టడంతో అమె మృతి చెందినట్లు తెలిపారు.

## ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి

**మిరుదొడ్డి, మే 26, ప్రభాతవార్త :** ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన సంఘటనలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఖాజీపూర్ కల్వకుంట వెళ్లేదారిలో శుక్రవారం జరిగింది. అక్బర్‌పేట–భూంపల్లి పోలీసుల కథనం ప్రకారం... అక్బర్‌పేట–భూంపల్లి మండలం ఖాజీపూర్ గ్రామానికి చెందిన రాజు గురువారం రాత్రి ట్రాక్టర్‌ను అతివేగంగా నడుపుతూ ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో కల్వకుంట గ్రామ శివారులో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



బోల్తా పడిన ట్రాక్టర్



కాలనీ సమస్యలను అడగితెలుసుకుంటున్న కార్పొరేటర్ సింధుఆదర్శ్‌రెడ్డి

## సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక : కార్పొరేటర్

**రామచంద్రాపురం, మే 26, ప్రభాతవార్త:** కాలనీల్లోని సమస్యలను ప్రత్యేక ప్రణాళికతో పరిష్కరిస్తున్నట్లు భారతీనగర్ కార్పొరేటర్ వెన్నెవరం సింధుఆదర్శ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని వార్డు కార్యాలయంలో హెచ్ఐజి మాధవనగర్ నీటి సమస్య, మాక్స్ సొసైటీ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ గురించి జలమండలి అధికారులతో సింధుఆదర్శ్‌రెడ్డి సమావేశం అయ్యారు. హెచ్ఐజి కాలనీ ట్యాంక్ నుంచి నీటి పైపులైన్ త్వరగా వేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. మ్యాక్ సొసైటీ కాలనీలో డ్రైనేజీ లీకేజి సమస్యలను తొలగించాలని, కొత్త డ్రైనేజి పైపులైన్ కొరకు ప్రతిపాదనలు పంపాలని, శాశ్వతంగా సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. ప్రజలు పేర్కొన్న ప్రతి సమస్యను పరిష్కరించడం జరుగుతుందని కార్పోరేటర్ భరోసా కల్పించారు.

**సాయిబాబా ఆలయంలో కార్పొరేటర్ పూజలు...**

ఎంఐజి కాలనీలోని సద్గురు సాయిబాబ ఆలయ 22వ వార్షికోత్సవంలో కార్పొరేటర్ వెన్నెవరం సింధుఆదర్శ్‌రెడ్డి పాల్గొని బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్పొరేటర్‌ను ఆలయ కమిటీ బాధ్యులు సాదరంగా స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం హరికృష్ణ, జనార్ధన్, హెచ్ఐజి అధ్యక్షులు బిఎన్‌రెడ్డి, డైరెక్టర్లు మధుసూదన్, నీల కంఠం, ఆలయ కమిటి బాధ్యులు ప్రసాద్, రాజు, అనిత, సావిత్రి పాల్గొన్నారు.

## కాలనీ సమస్యలను పరిష్కరిస్తా : కార్పొరేటర్



బస్తీ దర్శన్‌లో పాల్గొన్న కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్

**రామచంద్రాపురం, మే 26, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని రామచంద్రారెడ్డినగర్‌లో శుక్రవారం బస్తీ దర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన రామచంద్రాపురం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ కాలనీవాసులు, అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డునంబర్ 2లో ఉన్న డ్రైనేజీ సమస్య, ఇతర సమస్యల పరిష్కారానికి కావాల్సిన నిధుల కోసం ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ సమస్య పరిష్కారం అయితే కాలనీలో సమస్యలు లేకుండా ఉంటుందని, ఫలితంగా ప్రజలు ప్రశాంతంగా ఉండే అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు చంద్రశేఖర్ గుప్త, రాజిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సిఎం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ లైఫ్‌పై అవగాహన సమావేశం



మాట్లాడుతున్న ఎంపిపి సరళ

**కంది, మే 26, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మిషన్ లైఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులకు, పంచాయతీ కార్యదర్శులకు మిషన్‌లైఫ్‌పై ఎంపిపిఅధ్యక్షులు సరళ అవగాహన కల్పించారు. సమావేశంలో ఎంపిడిఓ కోట్ల విశ్వప్రసాద్, జడ్పీటిసి సభ్యులు కొండల్‌రెడ్డి, టిఎస్ రెడ్‌కో జిల్లా మేనేజర్ చౌహాన్ మాణిక్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు : ఇన్‌చార్జి ఎవో



ఫర్టిలైజర్ డీలర్‌లకు సూచనలు చేస్తున్న వ్యవసాయ అధికారులు

**కంగ్టి, మే 26, ప్రభాతవార్త:** ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్నందున నకిలీ విత్తనాలు, ఎరువులను అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి వెంకటేశం హెచ్చరించారు. శుక్రవారం కంగ్టిలోని రైతువేదికలో ఎరువుల డీలర్‌లతో ఏర్పాటుచేసిన సమావేశంలో వెంకటేశం మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, మందులను అమ్మాలన్నారు. నాసికరం, కాలం చెల్లిన ఎరువులు, విత్తనాలు అమ్మితే రైతులు ఆర్థికంగా నష్టాలకు లోనవుతారని, అందుకు వాటిని అమ్మకూడదని పేర్కొన్నారు. ఫర్టిలైజర్ దుకాణంలోని స్టార్ రిజిస్టార్ స్టాక్ వివరాలను విధిగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ వంశీ, డీలర్‌లు ఉన్నారు.

## బిజెపితోనే సుస్థిర అభివృద్ధి సాధ్యం : విఠల్

**పెద్దశంకరంపేట, మే 26 ప్రభాతవార్త:** బిజెపితోనే సుస్థిర అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేటలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి మోడీ ఆధ్వర్యంలో 9 సంవత్సరాల కాలంలో భారతదేశం అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలిచిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు బీజేపీ కార్యకర్తలు, నాయకులు జన సంపర్క్ యోజన కార్యక్రమంలో భాగంగా బీజేపీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులను మోసం చేస్తూ పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. ఇప్పటి వరకు రైతులకు రుణమాఫీ చేయలేదని, పంట నష్ట పరిహారం కూడా రైతులకు ఇవ్వలేదని విమర్శించారు. వెంటనే ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయడంతో పాటు పంట నష్ట పరిహారం కూడా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఎన్నికల సమయంలో నిరుద్యోగ భృతి ఇసానతమని హామీ ఇచ్చి నిరుద్యోగులను ముఖ్యమంత్రి కేసీఆర్ మోసిగించారన్నారు. నోటీఫికేషన్లు విడుదల చేసి నిరుద్యోగ భృతి కూడా చెల్లించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు శ్రావణ్‌కుమార్, మంగలి కృష్ణ, బుగుడాల కృష్ణ, దమ్ము సాయిలు, నరేష్, సుధాకర్, కుమార్, సురేష్, సంగమేశ్వర్, శ్రీను, రాజు పటేల్, కిషన్, మాజీ ఎంపీటీసీ స్వీప్న శ్రీనివాస్ తదితరులు ఆపల్గొన్నారు.



మాట్లాడుతున్న బిజెపి మండల అధ్యక్షులు కోణం విఠల్

# ఇంటింటికి తాగునీరు అందించిన ఘనత సిఎం కెసిఆర్‌దే

**నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి**

**మనూర్, మే 26, ప్రభాతవార్త:** కోటి రూపాయలతో 4 గ్రామాల్లో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌ల నిర్మాణానికి నారాయణఖేడ్ శాసన సభ్యుడు మహారెడ్డి భూపాల్‌రెడ్డి శుక్రవారం పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. మనూర్‌లో 34లక్షల 88వేల రూపాయలతో 120 కిలోలీటర్ల సామర్థ్యం, రాణాపూర్‌లో 90 కిలోలీటర్ల ట్యాంక్‌కు 29లక్షల 59వేల రూపాయలతో, ఉసిరికెపల్లి గ్రామంలో 40 కిలో లీటర్ల సామర్థ్యం గల వాటర్‌ట్యాంక్‌ను 20 లక్షల 91 వేల రూపాయలతో నిర్మించేందుకు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే వెనుకబడ్డ నారాయణఖేడ్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను చేపడుతున్న ఘనత ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకే దక్కుతుందన్నారు. మిషన్ భగీరథ పథకంలో ఇంటింటికి తాగునీరు అందించిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.



మనూర్‌లో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**ఎస్‌సి కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమి పూజ**

మండల కేంద్రమైన మనూర్‌లో రూ. 5 లక్షలతో నిర్మించే ఎస్‌సి కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి శుక్రవారం భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపిపి అధ్యక్షులు జయశ్రీ మోహన్‌రెడ్డి, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు విఠల్ రావు, సర్పంచ్‌లు శివాజీరావు, రాజేందర్‌రావు, బిఆర్ఎస్ నాయకులు నాగేందర్, తహసీల్దార్ తారా సింగ్, ఆర్‌డబ్లుఎస్ డిఈఈ ఫణివర్మ పాల్గొన్నారు.





చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జార్జి జె.హనుమంత్‌రావు

## గృహ కార్మికుల చట్టాలపై అవగాహన

**సంగారెడ్డి బ్యూరో, మే 26, ప్రభాతవార్త:** మెద్వన్, జిల్లా న్యాయ సేవాధికారి సంయుక్తంగా సంగారెడ్డిలోని మెద్వన్ కార్యాలయంలో గృహ కార్మికులకు చట్టాలపైనా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులు సెక్రటరీ అండ్ సీనియర్ సివిల్ జార్జి డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ జె.హనుమంత్ రావు, మెద్వన్ సెక్రటరీ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవ హక్కులను కాపాడుకోవాలంటే చట్టాలపైనా అవగాహన ఉండాలని తెలిపారు. ప్రతి ఇంట్లో ప్రతి ఒక్కరు కష్టపడి చదివితే సులువుగా ఉద్యోగాలు చేసుకోవడానికి ఉంటుందని గృహ కార్మికులకు తెలియజేశారు. గృహ కార్మికులను యజమాని నమ్ముతాడని, నమీ పనిలో పెట్టుకుంటారు మీరు అందరూ నమ్మకంతో పని చేస్తారని, అందుకే మీరు చేస్తున్న పని చాల గొప్పపని మీకు చాలా సమస్యలుంటాయన్నారు. మీకు చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో గృహ కార్మికులకు యూనియన్ రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని, ప్రభుత్వ పథకాలు కూడా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మేద్వాన్ కోఆర్డినేటర్ స్వప్న, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ ముహజీబ్, మేద్వన్ సిబ్బంది, గృహ కార్మికులు పాల్గొన్నారు.

**సంగారెడ్డి పట్టణంలో...**

**సంగారెడ్డి టౌన్, మే 26, ప్రభాతవార్త:** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మెద్వన్ సంయుక్తంగా జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని మెద్వన్ కార్యాలయంలో శుక్రవారం గృహ కార్మికులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జి జిల్లా లీగల్ సర్వీస్ అథారిటి జె హన్మంత్‌రావు, మెద్వన్ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డిలు హాజరై కార్మికులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి హన్మంత్‌రావు మాట్లాడుతూ చట్టాలపై అవగాహన ఉంటే మానవ హక్కులను కాపాడుకునే ఆస్కారం ఉంటుందన్నారు. ప్రతి ఇంట్లో విద్యావంతులు అయ్యేందుకు విధిగా చదువును ఆర్జించాలని సూచించారు. కార్మికులు తమ చిన్నారులను అన్ని వసతులు కల్గిన ప్రభుత్వ పాఠశాలలకు విద్యను అందుకునేందుకు పంపాలని సూచించారు. సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో గృహ కార్మికులకు యూనియన్ రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని, పేదలకు ఉచిత న్యాయ సహాయం అందించడం జరుగుతుందని, కార్మికులకు కల్పించిన సౌకర్యాలు, అవకాశాల్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

## హద్నూర్ మాజీ సర్పంచ్ భర్త మృతి

**-కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే**

**న్యాల్‌కల్, మే 26, ప్రభాతవార్త:** మండలంలోని హద్నూర్ గ్రామ మాజీ సర్పంచ్ కొత్తోళ్ల భాగమ్మ భర్త కొత్తోళ్ల హన్మంతు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు హద్నూర్ గ్రామానికి చేరుకుని హన్మంతు పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. గురువారం రాత్రికి మాజీ సర్పంచ్ భర్త హద్నూర్ గ్రామంలోని స్వగృహంలో మృతి చెందారు. శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే మాణిక్‌రావు మాజీ సర్పంచ్ గృహానికి చేరుకుని హన్మంతు పార్థివ దేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకులు బోడ భాస్కర్, వరాలు, కొత్తోళ్ల నర్సింలు, దేవదాస్ తదితరులు ఉన్నారు. స్వామిదాస్ తదితరులు ఉన్నారు.

## ఆంజనేయులును పరామర్శించిన ఎమ్మెల్యే

**కంగ్టి, మే 26, ప్రభాతవార్త:** అనారోగ్యంతో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు ఆంజనేయులును నారాయణఖేడ్ శాసన సభ్యులు మహారెడ్డి భూపాల్‌రెడ్డి పరామర్శించారు. మండలంలోని తడ్కల్ గ్రామానికి చెందిన ఆంజనేయులు నివాసానికి శుక్రవారం ఎమ్మెల్యే చేరుకుని ఆరోగ్య పరిస్థితిని అడగితెలుసుకున్న ఎమ్మెల్యే ధైర్యంగా ఉండాలని, బిఆర్ఎస్ పార్టీ మనకు అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మనోహర్, జడ్పీటిసి రాఘువరెడ్డి, బిఆర్ఎస్‌వి అధ్యక్షులు అంజాగౌడ్, మాజీ సర్పంచ్ పండరి, నాయకులు సత్యనారాయణ ఉన్నారు.

## ఆడపడుచుల వివాహానికి ఎంపిపి ఆర్థిక సహాయం

**జిన్నారం, మే 26, ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల కేంద్రంలో దప్పు లక్ష్మీ వీరయ్య కూతురు ప్రవలిక వివాహానికి ఎంపిపి రవీందర్‌గౌడ్ రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. జిన్నారం మండలంలో ఆడపడుచుల వివాహాలకు తనకు తోచిన సహాయం చేస్తూ ఆడపడుచులకు ఎల్లవేళలా అండగా నిలబడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు మ్యాధరి శంకరయ్య, గోకర్ వెంకటేష్, పల్నాటి భాస్కర్, బండి రాందాస్, తోట సంజీవ, అశోక్ యాదవ్, యనగండ్ల నరేందర్, వినోద్ పాల్గొన్నారు.

## ప్రగతి పథంలో పటాన్‌చెరువు పల్లెలు : ఎమ్మెల్యే



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరువు, మే 26, ప్రభాతవార్త:** పటాన్‌చెరువు నియోజకవర్గంలోని గ్రామాలను ప్రభుత్వం అందించే నిధులతో పాటు సిఎస్ఆర్ నిధులతో ప్రగతికి ప్రతీకలుగా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పాశమైలారం గ్రామంలో జీవీఆర్ ఎంటర్‌ప్రైజేస్ సౌజన్యంతో రూ.2 కోట్ల 50 లక్షలతో నందిగామ మీదుగా క్యాసారంవరకు నిర్మించిన రోడ్డు, రిట్జ్ ఇండియా పరిశ్రమ సహకారంతో రూ.5 లక్షల 25 వేలతో ఏర్పాటు చేసిన వీధి దీపాలు, రూ.18 లక్షలతో నిర్మించిన బీటి రోడ్డును స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో గ్రామీణ ప్రాంతాలు ప్రగతికి ప్రతీకలుగా నిలుస్తున్నాయన్నారు. పటాన్‌చెరువు నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నాయని తెలిపారు. గ్రామాల మధ్య అంతర్గత రహదారులు, బ్రిడ్జిలు నిర్మించడం మూలంగా మెరుగైన రహదారి సౌకర్యం లభించడంతో పాటు శరవేగంగా అభివృద్ధి కొనసాగుతోందన్నారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములైనప్పుడే వాటికి సార్థకత చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుష్మాశ్రీ వేణుగోపాల్‌రెడ్డి, జడ్పీటిసి సుప్రజా వెంకట్‌రెడ్డి, గ్రామ ఇంచార్జీ సర్పంచ్ మోటే కృష్ణ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పాండు, గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు, సీనియన్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వివాహిత అదృశ్యం

**కంది, మే 26, ప్రభాతవార్త:** వివాహిత సుమలత(23) అదృశ్యమైన సంఘటన మండలంలోని కవలంపేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ కథనం ప్రకారం ఇందు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఆరు సంవత్సరాల క్రితం టంగుటూరు గ్రామానికి చెందిన సుమలతతో కొంద్ర రాజు వివాహం జరిగింది. వీరు కవలంపేట గ్రామంలో కాపురం చేస్తున్నారు. ఈ నెల 15వ తారీఖున ఉదయం 9గంటల ప్రాంతంలో సుమలత ఇంట్లో ఎవరితో చెప్పా పెట్టకుండా తన చదువు సర్టిఫికెట్లు, 6వేల రూపాయల నగదును తీసుకుని వెళ్లిపోయిందన్నారు. భర్త కొంద్రు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అదృశ్యమైన వివాహిత ఆచూకి తెలిస్తే సంగారెడ్డి రూరల్ ఎస్‌హెచ్ఓ 8712656746, సిఐపి సంగారెడ్డి రూరల్ 8712656719లకు సమాచారం అందించాలని ఎసై వివరించారు.

## స్టేట్ ర్యాంక్ విద్యార్థులకు సన్మానం

**సదాశివపేట, మే 26, ప్రభాతవార్త:** పట్టణంలోని ఉజ్వల కళాశాలలో విద్యను అందుకుంటూ రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను రిలయన్స్ ట్రెండ్ యాజమాన్యం తరఫున స్టోర్ మేనేజర్ సాయి కుమార్ శుక్రవారం ఘనంగా సన్మానించి అభినందించారు. ఇంర్మీడియట్‌లో రాష్ట్ర స్థాయిలో ఉజ్వల 6వ ర్యాంక్‌ను, బి శివాని 9వ ర్యాంక్, టౌన్ ఫస్ట్, మంచి మార్కులతో ఉత్తీర్ణులైన 31 మంది విద్యార్థినీ విద్యార్థులకు గోల్డ్ మెడల్‌తో పాటు ప్రశంసా పత్రాలను అందించి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కూచి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ రఘువర్ధన్‌రెడ్డి, డైరెక్టర్ అమరేందర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## నాగల్‌గిద్దలో సిసి రోడ్డు పనులు ప్రారంభం

**నాగల్‌గిద్ద, మే 26, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో సిసి రోడ్డు నిర్మాణం పనులను శుక్రవారం గ్రామ బిఆర్ఎస్ ఉపాధ్యక్షులు శ్రీకాంత్ భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించి పనులను ప్రారంభించారు. గ్రామంలో ఎస్టీఎప్ నిధులతో సిసి రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభించారు. బిఆర్ఎస్ హయాంలో ప్రతి గ్రామం అభివృద్ధిలో దూసుకుపోతున్నట్లు శ్రీకాంత్ గుర్తు చేశారు.



నాగల్‌గిద్దలో సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న శ్రీకాంత్

# పాఠశాల భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ

**ఝరాసంగం, మే 26, ప్రభాతవార్త:** మండలంలోని ఈదుపల్లి గ్రామంలో శిథిలావసలో ఉన్న పాఠశాల భవనం స్థానంలో కొత్త భవనం నిర్మాణానికి ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు శుక్రవారం భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ స్వంత గ్రామమైన ఈదులపల్లిలో పాఠశాల భవన నిర్మాణానికి సొంత స్థలం అయిన 24 గుంటల భూమిని విరాళంగా అందచేశారు. పాఠశాల భవన నిర్మాణానికి ప్రభుత్వం 68లక్షల రూపాయలను మంజూరు చేయడంతో ఎమ్మెల్యే, డిసిఎంఎస్ చైర్మన్‌లు భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ సొంత గ్రామంలో పాఠశాల నిర్మాణానికి భూమిని విరాళంగా ఇవ్వడం ఆనందంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆత్మ కమిటి చైర్మన్ పెంటారెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు రాచయ్య స్వామి, రైతు సమన్వయసమితి అధ్యక్షులు సుభాష్ రావు, సర్పంచ్ బస్వరాజ్ పాటిల్, ఉప సర్పంచ్ యేసయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు పండరి, నాయకులు ఇజ్రాయిల్ బాబి, సత్యం ముదిరాజ్, శివప్ప, మారుతి, సిద్దయ్య, శేఖర్‌పాటిల్, రాజు, ఉపేందర్, సామేల్, రవి, సలావుద్దీన్, మౌలానా, నర్సింలు, మాణిక్యం, వీరనన, నాగరాజ్, నాగేశ్వర్, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు



రవీందర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ హరికృష్ణ తదితరులు

## గౌడ సంఘం మండల అధ్యక్షుడు రవీందర్‌గౌడ్‌కు సన్మానం

**శివ్వంపేట, మే 26 ప్రభాతవార్త:** గౌడ సంఘం మండల అధ్యక్షుడిగా నియామకమైన శివ్వంపేటకు చెందిన కొడకంచి రవీందర్‌గౌడ్‌ను శుక్రవారం వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. యువనాయకులైన రవీందర్‌గౌడ్‌ను సంఘం అధ్యక్షులుగా నియమించడంపట్ల గౌడ కులస్థులకు పూర్తి న్యాయం జరుగుతుందని ఎంపీపీ అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ, శివ్వంపేట మాజీ సర్పంచి పులి మామిడి స్రవంతి నవీన్‌గుప్త విలేకరులతో మాట్లాడుతూ అన్నారు. రవీందర్‌గౌడ్ నాయకత్వంలో గౌడ కులస్థులకు పూర్తి న్యాయం జరుగుతుందని వారు అన్నారు. తనను అభినందించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు జంగం విజయ వెంకటేష్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌గౌడ్, ఎంపీటీసీ సభ్యులు నువ్వుల దశరథ, సర్పంచులు అనూష అశోక్‌గౌడ్, బాలమణి నరేందర్, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు కొడకంచి శ్రీనివాస్‌గౌడ్, వారాల గణేష్, దానబోయిన కృష్ణ, ఇసారపు శ్రీనివాస్‌గౌడ్, ఇసారపు రాజు, వజ్జ నాగేష్, కామని నాగేష్ తదితరులు ఉన్నారు.

## జడ్‌పిటిసిని పరామర్శించిన ఎమ్మెల్యే

**మనూర్, మే 26, ప్రభాతవార్త:** జడ్పీటిసి సభ్యరాలు పుష్పబాయిని శుక్రవారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పరామర్శించారు. జడ్పీటిసి పుష్పబాయి అనారోగ్యంతో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆమె నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉందని ఆయన భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఎంపిపి అధ్యక్షులు జయశ్రీమోహన్‌రెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు విఠల్‌రావు, సర్పంచ్ శివాజీరావు, ఆర్‌డబ్లుఎస్‌న డిఈఈ ఫణివర్మ, తహసీల్దార్ తారాసింగ్ ఏఈ అన్నన్ ఉన్నారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన రాజు

**సదాశివపేట, మే 26, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం బిఆర్ఎస్ రాష్ట్ర నేత, పిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ పులిమామిడి రాజు సొంత ఖర్చులతో చలి వేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఆసుపత్రికి ఆయా మండలాల్లోని గ్రామాల నుంచి ప్రజలు వైద్యం అందుకునేందుకు వస్తారని, రోగులతోపాటు తోడుగా వచ్చే వారు తాగునీటి కోసం అవస్థలు పడకుండా చల్లని నీటిని అందించేందుకు చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సంగారెడ్డి పట్టణంలో నాలుగుచోట్ల చలివేంద్రాలు, అంబలి కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చుతుండటం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**శివ్వంపేట, మే26 ప్రభాతవార్త:** శివ్వంపేట మండలం తాళ్ల గిరిజన తండాకు చెందిన కాట్రోత్ శంకర్ ఆకస్మాత్తుగా మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ పబ్బా మహేష్‌గుప్త శుక్రవారం వారి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేసి ధైర్యం కల్పించారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటానని మహేష్‌గుప్త హామీ ఇచ్చారు. అదేవిధంగా మహేష్‌గుప్త దొంతి శివారులోని జీవన్ దివ్య గార్డెన్స్‌లో జరిగిన మాజీ సర్పంచి కుమారుడి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. మహేష్‌గుప్త అను నేను రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ ఆదుకుంటానని, ప్రజల ఆశీర్వాదం తనకు ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన అన్నారు.

## వీవోఏల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న రాజేశ్వరి

**పెద్దశంకరంపేట, మే 26 ప్రభాతవార్త:** వీవోఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వీవోఏల సంఘం మండల అధ్యక్షురాలు రాజేశ్వరి అన్నారు. శుక్రవారం వీవోఏలు చేపట్టిన సమ్మె 40 రోజులకు చేరింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.10 లక్షల సాధారణ భీమా, ఆరోగ్య భీమా సౌకర్యం, అర్హులైన వారికి సీసీలుగా ప్రమోషన్లు కల్పించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో వీవోఏలు రమ, స్వరూప, పుష్ప, విజయలక్ష్మీ, శంకర్, నగేష్ తదితరులు ఉన్నారు.

## నేడు బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

**పెద్దశంకరంపేట, మే 26 ప్రభాతవార్త:** మండల పరిధిలోని శివాయిపల్లి శివారులోని బీరప్ప ఆలయంలో శనివారం రెండో విడత బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షులు మురళీ పంతులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఇంచార్జి, ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం, నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిలు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మొద్దు

**హత్నూర, మే 26, ప్రభాతవార్త:** విత్తన ఎరువుల విక్రయదారుల సమావేశం మండలంలోని కాసాల రైతే వేదికలో శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు, సీఐ నవీన్ కుమార్, ఎస్ఐ లక్ష్మారెడ్డి హాజరై నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మరాదని అలా అమ్మినచో వారిపై పిడి యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ధ్రువీకరణ పొందిన వాటినే విక్రయాలు జరపాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రేమ్‌రాజ్, వరప్రతాప్, స్రవంతి, డీలర్లు మశెట్టి ప్రభాకర్, కుమ్మరి రమేష్, ప్రకాష్‌రెడ్డి, రాజు, సత్యం, రాజేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నవగ్రహ, బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

**జిన్నారం, మే 26, ప్రభాతవార్త:** జిన్నారం మధిర గ్రామమైన పెద్దమ్మ గూడెం గ్రామంలో జూన్ 3 నుంచి 7 వరకు బొడ్రాయి, లింగమయ్య, ఊరడమ్మ, ప్రతిష్టాపన ప్రతిష్టాపన కార్యక్రమాలు జరగనున్నాయి. జూన్ 5వ తేదీన జరిగే నవగ్రహ, బొడ్రాయి, లింగమయ్య, ఊరడమ్మ, ప్రతిష్ట మహోత్సవానికి హాజరుకావాల్సిందిగా పటన్‌చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని యాదవ సంఘం సభ్యులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం సభ్యులు కోరిన విధంగా నవగ్రహ, బొడ్రాయి, లింగమయ్య, ఊరడమ్మ, గాలిపోచమ్మ విగ్రహాలను ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకటేష్‌గౌడ్, ఉపసర్పంచ్ సంజీవ, వార్డు సభ్యులు శ్రీధర్ గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గుర్తింపు

**సంగారెడ్డి టౌన్, మే 26, ప్రభాతవార్త:** పట్టణంలో శుక్రవారం సాయంత్రం గుర్తు తెలియని శవాన్ని కనుగొన్నట్లు ఎసై పేర్కొన్నారు. ఎస్ఐ కథనం ప్రకారం ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో జిల్లా ఆసుపత్రి ముందర భాగంలో బస్ స్టాప్ ఎదురుగా గుర్తు తెలియని వ్యక్తి (35-40) మధ్య వయసు గల గుర్తు తెలియని స్పృహ లేకుండా పడి ఉండటంతో సంగారెడ్డి పట్టణం ఉప్పర్ బజార్‌కు చెందిన అంబులెన్స్ డ్రైవర్ షేక్ బాబు సెక్యూరిటీ సిబ్బందితో కలసి స్పృహకోల్పోయిన వ్యక్తిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు గుర్తు తెలియని వ్యక్తిని పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. గుర్తు తెలియని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మార్చురీలో భద్రపర్చినట్లు పట్టణ ఇన్స్‌పెక్టర్ యస్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.